
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





అన్నమయ్య

జిల్లా వార్తలు

5

మంగళవారం 23 ఏప్రిల్ 2024





పండువెన్నెలలో సీతారాముల కల్యాణ దృశ్యం



కల్యాణ వైభోగమే





పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

కోదండరాముడి కల్యాణం..
కనీవిని ఎరుగని వైభోగం..
హరికి, సిరికి కల్యాణం..
దివిలో, భువిలో రమణీయం..
కోదండరాముని కల్యాణం..
కనిన కలుగును పెనుపుణ్యం..
కన్నుల పండుగ కల్యాణం..
దుష్టశిక్షణ, శిష్ట రక్షణ ఒసగెను జగతికి ఆనందం
లోక రక్షణకు కల్యాణం..
లోకోద్ధరణమే రామమతం..

- పండు వెన్నెల్లో.. శోభాయమానంగా సీతారాముల కల్యాణోత్సవం
- విద్యుద్దీపకాంతుల్లో మెరిసిన కల్యాణ వేదిక
- వేలాదిగా హాజరైన భక్తులు
- భారీ పోలీసు బందోబస్తు
- అలరించిన సంగీత కార్యక్రమాలు
- అధికారుల పర్యవేక్షణలో ప్రశాంతంగా పూర్తయిన కల్యాణం

రాజంపేట/ఒంటిమిట్ట, ఏప్రిల్ 22: ఆంధ్ర భద్రాద్రి కడప జిల్లా ఒంటిమిట్ట (ఏకశిలా నగరం) కోదండరాముడి కల్యాణోత్సవం సోమవారం రాత్రి కన్నులపండువగా జరిగింది. పండు వెన్నెల్లో, ఆకాశం నుంచి నెలరాజు తొంగి చూస్తుండగా ఆహ్లాదకరమైన వాతావరణంలో వేదపారాయణం మధ్య తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితులు, ఒంటిమిట్ట కోదండరామ ఆలయ అర్చకుల సంయుక్త ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. వేలాది మంది భక్తుల రామనామ సంకీర్తనలు, పండితుల చతుర్వేద పఠనం.. మంగళవాయిద్యాల నడుమ.. సోమవారం రాత్రి 8.12 గంటలకు స్వస్తిశ్రీ విజయాభ్యుదయ వాలివాహనశక చాంద్రమాన శ్రీ క్రోధినామ సంవత్సర, చైత్రశుద్ధ చతుర్దశి చిత్ర నక్షత్ర యుక్త శుభలగ్నములో శ్రీరామ చంద్రమూర్తి, సీతమ్మను పరిణయమాడాడు. రమణీయం.. కమనీయమైన ఈ సుందర దృశ్యాన్ని తిలకించిన భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. లోకకళ్యాణార్థం.. జగమేలే వైకుంఠ రాముని జగత్ కల్యాణం ఆంధ్రాభద్రాద్రి ఏకశిలా నగిరి ఒంటిమిట్ట జగదభిరాముడి దివ్యక్షేత్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం అధ్వర్యంలో నభూతో నభవిష్యతే అన్న రీతిలో ఈ కల్యాణోత్సవం నిర్వహించారు. కోదండరాముడి కల్యాణోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ కార్యదర్శి కరికాలవలవన్ ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను సమర్పించారు. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం తరపున టీటీడీ ఈవో ధర్మారెడ్డి, దంపతులు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలను, ముత్యాల తలంబ్రాలను కోదండరామునికి సమర్పించారు. ఎన్నికల కోడ్ కారణంగా రాజకీయ జోక్యం లేకుండా కేవలం టీటీడీ అధికారులు, కడప జిల్లా యంత్రాంగం పర్యవేక్షణలో ఈ కల్యాణోత్సవాన్ని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు.



కల్యాణం.. రమణీయం

ఒంటిమిట్ట కోదండరామాలయ కల్యాణ ప్రాంగణంలో సోమవారం రాత్రి 6.30-8.30 గంటల మధ్య సీతారాముల కల్యాణ వేడుకను వేదపండితులు వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవవరులకు నూతన పట్టువస్త్రాలు, టీటీడీ అందించిన బంగారు శఠారి, యజ్ఞోపవీతం ఆభరణాలను, వివిద రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. ముందుగా ఉత్సవ వరులను పల్లకిపై కొలువుదీర్చి 3.15 గంటలకు ప్రధాన ఆలయం నుంచి మంగళవాయిద్యాల మధ్య.. భక్తుల శ్రీరామ.. జయజయరామ ధ్వానాలతో కల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చారు. అనంతరం 4.30 గంటల నుంచి 5 గంటల వరకు ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. వేదికపైన రజిత సింహాసనంపై కల్యాణ మూర్తులను ఆశీనులు చేసి సాయంత్రం 6.30 గంటల నుంచి కల్యాణతంతును ప్రారంభించారు. భగవత్‌విజ్ఞాపనం, సభఅనుజ్ఞ, లోకకళ్యాణం కోసం సంకల్పం చేయించారు. కల్యాణంలోని పదార్థాలన్నీ భగవంతుని మయం చేసేందుకు పుణ్యాహవచనం నిర్వహించారు. రక్షాబంధనం, యజ్ఞోపవీతధారణ, మధుపర్కార్చనం చేశారు. మహాసంకల్పం అనంతరం కన్యాదానం చేసి సీతారామచంద్రుల ప్రవరలను చదివారు. రాములవారి వంశస్వరూపాన్ని స్తుతించారు. అగ్ని ప్రతిష్టాపన తరువాత సీతారాముల తల మీద జీలకర, బెల్లం ఉంచి శాస్త్రోక్తంగా కల్యాణ వేడుకను నిర్వహించారు. తదనంతరం మంగళాష్టకం, చూర్ణిక పఠించి మాంగళ్యసూత్ర పూజ, మంగళ సూత్రధారణ అక్షతారోహణం చేపట్టారు. పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం వేదపండితులు కంకన్ బట్టర్ రాజేష్‌కుమార్ మంగళసూత్రాన్ని భక్తులకు చూపించి సాక్షాత్తు లక్ష్మీనారాయణుడైన శ్రీరామ చంద్రమూర్తి చేత శ్రీ మహాలక్ష్మీ స్వరూపిణి సీతా మహాదేవికి శాస్త్రోక్తంగా 8.12 గంటల సమయంలో మాంగళ్యధారణ జరిపించి, స్వామి నివేదన, వేదస్వస్తి, మహదాశీర్వచనంతో కల్యాణ ఘట్టం పూర్తి చేశారు. అనంతరం ముత్యాల తలంబ్రాలు కల్యాణ మూర్తుల శిరస్సులపై పోసి కన్నుల పండుగగా కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో టీటీడీ ఈవో ధర్మారెడ్డి దంపతులు, దేవాదాయ శాఖ కార్యదర్శి కరికాల వలవన్, ఎస్ ఎస్ రావన్, ప్రిన్సిపల్ సెక్రటరీ గిరిజాశంకర్, కడప కలెక్టర్ విజయరామరాజు, జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, ఉప జేఈవో రజిని, కడప జిల్లా జడ్జి శ్రీదేవి, జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్, ఎస్పీ సిద్ధార్థ కౌశల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంతులలో దగదగ

కల్యాణ వేదిక ప్రాంగణం చుట్టూ వైకుంఠాన్ని తలపించే విద్యుత్ దీప కాంతులు, శ్రీ సీతారామ లక్ష్మణులు, లక్ష్మీవెంకటేశ్వరుడు, మహావిష్ణువు లక్ష్మీతో పాటు వివిద దేవతామూర్తుల విద్యుత్ కటౌట్‌లు కల్యాణోత్సవానికి మరింత శోభను తెచ్చాయి. కల్యాణోత్సవాన్ని భక్తులు దగ్గరగా వీక్షించేందుకు భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ అధ్వర్యంలో ఉక్కపోతకు గురికాకుండా ఏసీలు, కూలర్‌లను, ప్రాంగణంలో వీవీఐపీలు, వీఐపీలు, భక్తులకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ఈ కల్యాణోత్సవాన్ని వేలాది మంది భక్తులు వీక్షించి భక్తితో పరవశించిపోయారు. ప్రతి భక్తుడికి మంచినీరు, మజ్జిగ, అన్నప్రసాదాలు, ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లను అందజేశారు. 150 కౌంటర్లలో అన్నప్రసాదాలు అందజేశారు.









అలరించిన సంగీత కార్యక్రమాలు

కల్యాణోత్సవం సందర్భంగా సంగీత కార్యక్రమాలు అలరించాయి. భజన, సంగీతం, నృత్యం, శ్రీరామనామామృతం, శ్రీరామ కృతుల నృత్యం అందరినీ అలరించాయి. తిరుపతి ఎస్వీ నృత్య కళాశాల అధ్యాపకురాలు లక్ష్మీ సువర్ణ బృందం నాదస్వరం, డోలు వాయిద్యం ఎంతో అలరించింది. డాక్టర్ వందన, చిన్నమ్మ దేవి, విద్యార్థులు మొత్తం 40 మంది శ్రీరామనామామృతం భజన వీనుల విందుగా నిర్వహించారు. ఎస్వీ సంగీత నృత్య కళాశాల డాక్టర్ ఉషారాణి ఆధ్వర్యంలో సీతా కల్యాణం, రామాయణ శబ్దం, కూచిపూడి నృత్యం ఎంతో ఆకట్టుకుంది. సీతారాముల కల్యాణం, శ్రీరామ పట్టాభిషేకం అంశాలను ఎంతో చక్కగా ప్రదర్శించారు. రవి సుబ్రమణ్యం, రఘువంశ సుధాబుధి, రామనామ యనరాదా.. భరతనాట్యం విశేషంగా ఆకట్టుకుంది.









గజ వాహనంపై సీతారాములు

కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు సోమవారం రాత్రి సీతారాముల కల్యాణం తరువాత గజవాహనంపై సీతారాములు భక్తులను కటాక్షించారు.

సీతారాములు మాత్రమే కలిసి విహరించే ఈ గజ వాహనానికి ఎంతో విశిష్టత ఉంది. రాజసానికి ప్రతీక మదగజం, రణరంగంలో, రాజదర్బారుల్లో, ఉత్సవాల్లో గజానిదే అగ్రస్థానం. కాగా సోమవారం ఉదయం స్వామి వారు శివధనుర్బాణాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



శివధనుర్బాంగాలంకారంలో స్వామి వారు

భారీ పోలీసు బందోబస్తు

కడప జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ నేతృత్వంలో ఒంటిమిట్ట కోదండరాముని కల్యాణ మహోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు సుమారు 1000 మంది పోలీసులతో గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీతో పాటు ముగ్గురు అదనపు ఎస్పీలు, ఆరుగురు డీఎస్పీలు, 30 మంది సీఐలు, 53 మంది ఎస్ఐలు, 750 మంది పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీ సుధాకర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, అదనపు ఎస్పీ వెంకటరాముడు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.వి.కృష్ణారావు, కడప డీఎస్పీ షరీఫ్, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్, ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్, జమ్మలమడుగు డీఎస్పీ టి.డి.యశ్వంత్, మైదుకూరు డీఎస్పీ వెంకటేశ్వర్లు ఈ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పది ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం

సికెదిన్నె, ఏప్రిల్ 22: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 2024 సంవత్సరం ఎస్ఎస్‌సీ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు విద్యాసంస్థల ఏజీఎం రమణయ్య తెలిపారు. సోమవారం విడుదల చేసిన ఫలితాల్లో 597, 596, 595, 594, 593 అత్యుత్తమ మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో కడప జిల్లా కీర్తిని విద్యాసంస్థలు చాటి చెప్పాయన్నారు. కడపజోన్ నుంచి 2,201 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వంద శాతం పాసయ్యారన్నారు. 595పైగా ఐదుగురు, 590పైన 47 మంది, 586కుపైగా 114 మంది, 580కి పైగా 205 మంది, 575మార్కులకు పైగా 332 మంది, 550కి పైగా 840 మంది, 500పైగా 1560 మంది విద్యార్థులు మార్కులు సాధించారన్నారు. ఇంతటి ఘనవిజయం సాధించి విద్యాసంస్థల పేరును నిలబెట్టిన విద్యార్థినీ విద్యార్థులను అభినందించి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఒలంపియాడ్, ఐఐటి, నీట్, ఆర్ఎంవో పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు మరింత మంది ఉన్నారన్నారు. ప్రతి ఇద్దరిలో ఒకరికి ఎస్ఎస్‌సీ ఫలితాల్లో 550 మార్కులు సాధించడం శ్రీచైతన్య విద్యాసంస్థలకే సాధ్యమన్నారు. 2011 నుంచి ఇప్పటి వరకు ప్రతి సంవత్సరం విద్యార్థులు శ్రీచైతన్య విద్యాసంస్థల పేరు నిలబెడుతూ ఫలితాల్లో ఘనవిజయం సాధించారన్నారు. విజయం పట్ల చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ షీమ, నాగేంద్రలు అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా బ్రాంచ్‌ల ప్రిన్సిపాళ్లు, కోఆర్డినేటర్లు, డీన్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పది ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో చైతన్య విద్యాసంస్థల ఏజీఎం రమణయ్య తదితరులు

పదిలో బాలికలదే పైచేయి

- 86 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 17వ స్థానం
- జిల్లాలో ఇరువురికి 597 మార్కులు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లాలో బాలికలదే పైచేయిగా నిలిచింది. జిల్లా నుంచి 22,240 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 19,276 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 86.67 శాతం ఉత్తీర్ణతతో అన్నమయ్య జిల్లా రాష్ట్రంలో 17వ స్థానంలో నిలిచింది. బాలురు 83.65 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలికలు 89.71 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి తెలియజేశారు. కలకడ ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలకు చెందిన పందిగుంట లిఖిత 597 మార్కులు, అలాగే మదనపల్లెలోని శ్రీ చైతన్య టెక్నో పాఠశాలకు చెందిన జె.శ్రావణి 597 మార్కులతో రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించి జిల్లా ప్రతిభను చాటారు. అలాగే రాజంపేటలోని శ్రీ విద్యాలయ పాఠశాలకు చెందిన సి.దేవాన్షి 596 మార్కులు, మదనపల్లె శ్రీచైతన్య పాఠశాలకు చెందిన షేక్ రుహినాజ్ 595 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపారు. బి.కొత్తకోట బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ తమన్నా 594, మదనపల్లె ఏపీ సోషియల్ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన మద్దేపల్లె దౌనిక 594, గ్యారంపల్లి రెసిడెన్షియల్ బాలుర పాఠశాలకు చెందిన శ్రీరాముల రూపేశ్ 594 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. అలాగే ఆలం చరీశ్‌రెడ్డి (592) మదనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల, జిగిని భార్గవి (592) పీలేరు వెల్ఫేర్ స్కూల్, గడ్డం గౌతమి (590) చిన్నతిప్పసముద్రం జడ్పీ హైస్కూల్, మస్తూరి సీమాఖానం (588) పీలేరు జెడ్పీ హైస్కూల్, మురుగు శ్రీచేతన్‌కుమార్ నాయుడు (585) వాయల్పాడు చెర్లోపల్లె జెడ్పీ హైస్కూల్, పల్లె మాధవి (585) దేవపట్ల జడ్పీ హైస్కూల్, షేక్ జైబా (584) రాజంపేట గర్ల్స్ హైస్కూల్, అక్తార్ కౌరిన్‌సుహా (584) పీలేరు జడ్పీ హైస్కూల్, కాములూరి తబసం (583) కురబలకోట జెడ్పీ హైస్కూల్, నాసన్న గిరిరాం చరణ్‌రెడ్డి (582) ముదివేడు మోడల్ స్కూల్, నిమ్మకాయల హేమంత్‌కుమార్‌రెడ్డి (582) బురకాయలకోట జడ్పీ హైస్కూల్, రాఘుల ప్రణతి (582) రాజంపేట గర్ల్స్ హైస్కూల్, మాదక మౌనిక (582) పుల్లంపేట మోడల్ స్కూల్, గడ్డం లోకరక్షితారెడ్డి (582) ముదివేడు మోడల్ స్కూల్, బండారు దీక్షిత (582) మదనపల్లె నీరుగట్టువల్లె జడ్పీ హైస్కూల్, బొమ్మలనేని హేమమాలిని (582) మదనపల్లె నీరుగట్టుపల్లె, సంకు వేణు (582) గ్యారంపల్లె రెసిడెన్షియల్ స్కూల్, ఓదేటి లక్ష్మీకృతిక (582) నడిమిచర్ల జడ్పీ హైస్కూల్, కలకడ, పీలేరు గర్ల్స్ బీసీ వెల్ఫేర్ స్కూల్‌కు చెందిన రాఘవప్రియ (582) మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరచారు.

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలతో పాటు ఏపీ మోడల్ స్కూల్, రెసిడెన్షియల్ స్కూల్, గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలు, ప్రైవేటు స్కూల్స్ ఎయిడెడ్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడం వల్ల అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.



లిఖిత -597 (కలకడ గురుకుల పాఠశాల)



జె.శ్రావణి -597 (మదనపల్లె శ్రీచైతన్య)



సి.దేవాన్ని -596 (రాజంపేట శ్రీవిద్యాలయం)



షేక్ రుహినాజ్-595 (మదనపల్లె శ్రీచైతన్య)



దౌనిక -594 (మదనపల్లె బాలికల గురుకుల పాఠశాల)



షేక్ తమన్నా -594 (బి.కొత్తకోట బాలికల ఉన్నత పాఠశాల)

నాల్గవరోజు ఊపందుకున్న నామినేషన్లు

- రాజంపేట ఎంపీకి 9 మంది నామినేషన్లు

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 22: నాల్గవ రోజు రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి స్థానానికి 9 మంది నామినేషన్లు వేశారు. మొదటి రెండు, మూడు రోజులు కాస్త పలుచగా నామినేషన్ వేయగా నాల్గవరోజు మాత్రం నామినేషన్లు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. రాజంపేట పార్లమెంట్ స్థానానికి వైసీపీ తరఫున పెద్దిరెడ్డి లక్ష్మిదివ్య, పీవీ మిథున్‌రెడ్డి మూడవ సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. అలాగే రాజంపేట ఎంపీ స్థానానికి సంగరాజు నాగేశ్వరరాజు, సంగరాజు జ్యోతి ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశారు. రాజంపేట ఎంపీ ఇండిపెండెంట్ అభ్యర్థి ఎం.శ్రీనివాసులు నామినేషన్ దాఖలు చేశారు. అలాగే రాయచోటి అసెంబ్లీ అభ్యర్థిగా గడికోట శ్రీకాంత్‌రెడ్డి 2 సెట్లు నామినేషన్‌లు చేశారు. ఇదే స్థానానికి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఇండియన్ యూనియన్ ముస్లిం లీగల్ పార్టీ షేక్ మక్బుల్‌బాషా నామినేషన్ వేశారు. పీలేరు అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరఫున బాలినేని సోమశేఖర్ నామినేషన్ వేశారు. రాజంపేట అసెంబ్లీ స్థానానికి సురేంద్రరెడ్డి జైభీంరావు పార్టీ నుంచి నామినేషన్ వేశారు. రాజంపేట అసెంబ్లీ స్థానానికి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి పూల విజయభాస్కర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఇతను ఇండిపెండెంట్‌గా మరో రెండు సెట్లు నామినేషన్ దాఖలు చేశారు. రాయచోటి అసెంబ్లీ స్థానానికి పెనుగొండ వెంకట్రమణ ఇండిపెండెంట్ అభ్యర్థిగా రెండు సెట్లు నామినేషన్ దాఖలు చేశారు.



అసంపూర్తిగా మిగిలి ఉన్న ఔట్‌ఫ్లో కాలువ

అడవిపల్లె గుర్తుందా.. రామచంద్ర...!

- పీలేరులో కానరాని జలయజ్ఞం పనులు
- నిర్వహణ లేక వెక్కిరిస్తున్న ఝరికోన

పీలేరు/ కలకిరి/ గుర్రంకొండ/ కలకడ/ వాల్మీకిపురం/ ఏప్రిల్ 22: సార్వత్రిక ఎన్నికలు-2019కు ముందు పీలేరు ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసీపీ తరపున పోటీ చేసిన చింతల రామచంద్రారెడ్డి తమ పార్టీ అధికారంలోకి వస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని అనేక హామీలు ఇచ్చారు. ఆయన చెప్పినట్లుగానే ఆయన పార్టీ అధికారంలోకి వచ్చింది. జగన్ సీఎం కావడంతో ఆయన తండ్రి, దివంగత సీఎం వైఎస్ఆర్ హయాంలో చేపట్టిన జలయజ్ఞం పనులు పరుగులు పెడతాయని నియోజకవర్గ ప్రజలు ఆశించారు. మిగిలిన అంశాల్లో కూడా చింతల తన హామీలన్నీ నెరవేర్చుతారని నియోజకవర్గ ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. కాలచక్రంలో ఐదేళ్లు గిర్రున తిరిగాయి. ఆయన హామీలు మాత్రం అలాగే ఉండిపోయాయి. ఐదేళ్లుగా నియోజకవర్గంలోని జలవనరుల అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నాయి. పీలేరు నియోజకవర్గ సాగు, తాగునీటి అవసరాలకు జీవనాడి లాంటి అడవిపల్లె ప్రాజెక్టును అయితే ఆయన ఒక్కసారి కూడా సందర్శించిన దాఖలాలు లేవు. ఇక ఆయన స్వంత ఊరైన వాల్మీకిపురం పట్టణానికి తాగునీరు అందించేందుకు తలపెట్టిన భోగంపల్లె రిజర్వాయర్ పనులు అడుగు కూడా ముందుకు సాగలేదు. చింతల మరిచిపోయిన హామీలలో కొన్ని...

అడవిపల్లె రిజర్వాయర్.. అంతులేని జాప్యం !!

హంద్రీ-నీవా పథకంలో భాగంగా కేవీపల్లె మండలం అడవిపల్లె వద్ద రిజర్వాయర్ నిర్మించి కరువు పీడిత ప్రాంతమైన ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సాగు, తాగునీరు అందించాలని 2006లో అప్పటి వైఎస్ సర్కారు తలపోసింది. కేవీపల్లె, పీలేరు, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, పాకాల, ఐరాల, పూతలపట్టు, తవనంపల్లె, బంగారుపాళెం, చిత్తూరు, గుడిపాల, పెనుమూరు మండలాల్లోని 80 వేల ఎకరాలకు సాగునీరు, అనేక వందల గ్రామాలకు తాగునీరు అందేలా రూపకల్పన చేశారు. జలయజ్ఞంలో అడవిపల్లె ప్రాజెక్టు నిర్మాణాన్ని 2006లో రూ.55.59 కోట్లతో ప్రారంభించారు. 2006లో ప్రారంభమైన మొదటి దశ పనులు 2016లో పూర్తయ్యాయి. అప్పట్లో ఆ ప్రాజెక్టు పరిశీలనకు సీఎం హోదాలో వచ్చిన చంద్రబాబు అడవిపల్లె రిజర్వాయర్ సామర్థ్యం గురించి తెలుసుకుని మరో టీఎంసీ పెంచి అక్కడి నుంచి పైపులైన్ల ద్వారా చిత్తూరు పట్టణానికి తాగునీరు అందిస్తానని ప్రకటించారు. ఆయన ఆదేశాల మేరకు రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచి నిర్మాణం చేయడానికి 2016లో అధికారులు రూ.29.21 కోట్లతో పనులు ప్రారంభించారు. టీడీపీ హయాంలో పరుగులు పెట్టిన రిజర్వాయర్ పనులు వైసీపీ అధికారంలోకి వచ్చాక నిధుల లేమితో మందగించాయి. హంద్రీ-నీవా పథకంలో భాగంగా గొలుసుకట్టు విధానంలో నిర్మితమైన ప్రాజెక్టులు కావడంతో ఎగువన రాయచోటి ప్రాంతంలోని రిజర్వాయర్లు నిండితేగానీ అడవిపల్లె రిజర్వాయర్ నిండే పరిస్థితి లేదు. ప్రస్తుతానికి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో తెచ్చే కాలువలు కూడా అసంపూర్తిగా ఉండడంతో కేవలం వర్షాధారంగా ప్రాజెక్టు నిండుతోంది.

ప్రతిపక్షంలో వద్దు... అధికారంలోకి వచ్చాక ముద్దు

వైసీపీ నాయకులు ఎందుకనో ముందు నుంచీ అడవిపల్లె ప్రాజెక్టుపై పెద్దగా శ్రద్ధ చూపలేదు. కానీ చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన చిత్తూరు పట్టణానికి పైపు లైను పనులపై మాత్రం ప్రత్యేక శ్రద్ధ చూపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అడవిపల్లె ప్రాజక్టులోని నీరంతా పీలేరు నియోజకవర్గానికే పరిమితం చేయాలని, చుక్కనీరు కూడా బయటకు ఇవ్వమంటూ ధర్నాలు, రాస్తారోకోలు, పాత్రికేయ సమావేశాలు నిర్వహించారు. అధికారంలోకి వచ్చాక గుట్టు చప్పుడు కాకుండా పైపులైను పనులు పూర్తి చేసేశారు. అధికార పార్టీ నేతల కారణంగా అడవిపల్లె ప్రాజెక్టు నుంచి చిత్తూరు సమీపంలోని ఎన్టీఆర్ జలాశయం వరకు సుమారు రూ.300 కోట్లతో పైపులైను నిర్మించారు. ఆ పనుల్లోనూ స్థానిక నాయకులకు అమ్యామ్యాలు ముట్టాయని పెద్దఎత్తున పుకార్లు ఉన్నాయి. పైపులైను నిర్మాణంపై చూపిన శ్రద్ధలో పావువంతు ప్రాజెక్టులోని నీరు తేవడంపై పెట్టి ఉంటే బావుండేదని, కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలు తరలించుకుపోగలిగిన వారు అడవిపల్లెకు మాత్రం నీరు తెప్పించుకోలేకపోవడం ఏమిటని పీలేరు నియోజకవర్గ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

మేడికుర్తి బాహుదా ప్రాజెక్టుకు జల'విఘ్నం'!

కలికిరి మండలం మేడికుర్తి గ్రామం వద్ద బాహుదా నదిపై నిర్మించిన ప్రాజెక్టు కొట్టుకుపోయి తొమ్మిదేళ్లు అవుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. 2015లో కురిసిన వర్షాలు, వరదలకు ఆ ప్రాజెక్టు పూర్తిగా కొట్టుకుపోయింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆ ప్రాజెక్టు గురించి పదే పదే ప్రస్తావించిన ఎమ్మెల్యే చింతల ఎందుకనో అధికారంలోకి వచ్చాక దాని గురించి పట్టించుకోలేదు. కలికిరి మండలంలోని 4400 ఎకరాలకు నేరుగా సాగునీరు, పరోక్షంగా భూగర్భజలాల పెంపు ద్వారా మరో 5 వేల ఎకరాలకు నీరందించేందుకు 2001లో టీడీపీ ప్రభుత్వం రూ.12.33 కోట్లతో ఆ ప్రాజెక్టు నిర్మాణానికి సిద్ధమైంది. ఆ పనులను ప్రస్తుత మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన పీఎల్ఆర్ సంస్థ దక్కించుకుంది. 2300 మీటర్ల మట్టికట్ట, 420 మీటర్ల పొడవుతో సిమెంటు మొరవ, తూముల నిర్మాణం, ఆశించిన 4400 ఎకరాల ఆయకట్టుకు నీరందించడానికి 12 కి.మీతో ఎడమ కాలువ, 16 కి.మీతో కుడి కాలువ నిర్మాణానికి ఆ సంస్థ పనులు చేపట్టింది. అయితే ఎడమ కాలువ 8 కి.మీ, కుడికాలువ 4.5 కి.మీ. మాత్రం పూర్తి చేశారు. నిధులు సరిపోలేదని కాలువల పనులను అర్ధంతరంగా వదిలేశారు.



మేడికుర్తి ప్రాజెక్టులో ఇసుక బస్తాలతో నిర్మించిన తాత్కాలిక కట్ట (ఫైల్)



అడవిపల్లె రిజర్వాయర్ కుడి ఆనకట్ట

అరకొరగా 2003 నాటికి ప్రాజెక్టును మాత్రం పూర్తి చేశామనిపించారు. ఆ తరువాత కురిసిన వర్షాలకు ప్రాజెక్టు నిండింది. అయితే సిమెంటు మొరవకు చిల్లులు పడి జల్లెడగా మారడంతో నీళ్లన్నీ వృథా అయ్యాయి. ఆ తరువాత ఏడాది కురిసిన వర్షాలకు ప్రాజెక్టు మట్టి కట్టడంలో లీకేజీలు మొదలయ్యాయి. 2015లో కురిసిన భారీ వర్షాలకు మొరవ, మట్టికట్టల్లో లీకేజీలు ఉధృతం కావడంతో ప్రాజెక్టు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో మేల్కొన్న ప్రభుత్వం, ప్రాజెక్టులో తాత్కాలికంగానైనా నీటిని నిలిపేందుకు రూ.25 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో గోనె సంచుల్లో ఇసుక నింపి అడ్డుకట్ట వేసినా అవి కూడా కొట్టుకుపోయాయి. ఇసుక బస్తాల వ్యవహారంలోనూ భారీ అవినీతి జరిగినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. మేడికుర్తి ప్రాజెక్టును తాత్కాలికంగానైనా పునరుద్ధరించి నీరు నిలపాలంటే రూ.5 కోట్లు ఖర్చవుతుందని అధికారులు అంచానా వేస్తున్నారు. తమ స్వంత సంస్థ చేసిన నిర్వాకం కావడం వల్లో ఏమో, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి మేడికుర్తి ప్రాజెక్టు గురించి ఏనాడూ పట్టించుకున్న దాఖలాలు లేవు.

నిర్వహణ కరువైన ఝరికోన

పీలేరు నియోజకవర్గంలోని కలికిరి, కేవీపల్లె, కలకడ మండలాల తాగునీటి ఎద్దడి శాశ్వత నివారణకు నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు కేవీపల్లె మండలంలో ఝరికోన ప్రాజెక్టు నిర్మించారు. అప్పట్లో కడప జిల్లా నాయకులతో విభేదించి మరీ ఆ ప్రాజెక్టును నిర్మించారాయన. సుమారు రూ.100 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణం, గువ్వలగుడ్డం వద్ద నీటిశుద్ధి ప్లాంటు ఏర్పాటు చేశారు. గువ్వలగుడ్డం వద్ద ఉన్న శుద్ధి ప్లాంటు నుంచి ఆ మూడు మండలాల్లో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటిని సరఫరా చేసి ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడం ఝరికోన ప్రాజెక్టు లక్ష్యం. 2014-19 వరకు సజావుగా సాగిన ఆ ప్రాజెక్టు నిర్వహణ వైసీపీ ప్రభుత్వం వచ్చాక పూర్తిగా కుంటుపడింది. ప్రతి నెలా విడుదల చేయాల్సిన నిర్వహణ నిధులను ఏడాదికో సారి విడుదల చేస్తూ దాని గురించి పట్టించుకోవడం మానేసింది. పోనీ ఎమ్మెల్యే అయినా దాని గురించి పట్టించుకున్నారా అంటే అదీ లేదు. నిర్వహణ నిధుల లేమి కారణంగా ప్రస్తుతం ఆ ప్రాజెక్టు పైపులైన్ లీకేజీలను సకాలంలో పూడ్చలేకున్నారు అధికారులు.

పిచ్చి మొక్కలతో నిండిన హంద్రీ-నీవా కాలువలు

పీలేరు మండలంలోని హంద్రీ-నీవా కాలువలు పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. ఆ పథకం గురించి కనీసం ఒక్కసారి కూడా ఎమ్మెల్యే పట్టించుకున్న దాఖలాలు లేదు. పీలేరు నియోజకవర్గంలో సుమారు 70 వేల ఎకరాలకు సాగునీరు అందించే కాలువలు నేడు పూడిపోయే దుస్థితికి చేరుకున్నాయి. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎందుకనో వైసీపీ నాయకులు వాటి గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. వ్యవసాయాన్ని పండుగ చేస్తామని పదేపదే ప్రకటనలు గుప్పించడం మినహా వ్యవసాయ అభివృద్ధి కోసం వారు చేసింది శూన్యం. హంద్రీ-నీవా పథకం అనుకున్నట్లు సమగ్రంగా పూర్తయి ఉంటే పీలేరు నియోజకవర్గ రైతాంగం లాభపడినంతగా మరే నియోజకవర్గ ప్రజలకు లాభపడి ఉండరని పలువురు విశ్రాంత ఇంజనీరింగ్ శాఖ అధికారులు తెలిపారు.

భోగంపల్లె రిజర్వాయర్‌లోనూ అదే అలసత్వం

వాల్మీకిపురం పట్టణ తాగునీటి అవసరాల కోసం రూపొందించిన భోగంపల్లె రిజర్వాయర్ కూడా గత ఐదేళ్లలో అభివృద్ధికి నోచుకోలేదు. వాల్మీకిపురం పట్టణ తాగునీటి అవసరాల కోసం 2008వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వ ఛీఫ్ విప్‌గా ఉన్న నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి కారణంగా రూ.7 కోట్ల వ్యయంతో భోగంపల్లె రిజర్వాయర్‌ను ప్రారంభించారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా సుమారు 1400 ఎకరాలకు సాగు నీరు అందించాలని కూడా సంకల్పించారు. అయితే దాని గురించి ఆ తరువాత ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ఆ ప్రాజెక్టు ఉందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది.

అదే పనిగా నీటి వనరుల విధ్వంసం

గడిచిన ఐదేళ్లుగా ఇసుక తవ్వకాల కోసం అధికార పార్టీ నాయకులు నదులు, చెరువులు, కుంటలు, కాలువలు, చెక్ డ్యాంలు వంటి నీటి వనరుల విధ్వంసానికి సిద్ధమయ్యారు. అక్రమార్జనే ధ్యేయంగా చెలరేగిపోయారు. పీలేరు నియోజకవర్గంలో సుమారు 1200 చిన్నా, పెద్దా చెరువులు ఉండగా, వాటిలో కనీసం సగం బంగారు, బొగ్గు గనులను తలపిస్తున్నాయి. ఇక నియోజకవర్గంలోని బాహుదా, పింఛా నదీ పరీవాహక ప్రాంతాల్లోని వందలాది చెక్ డ్యాంలు తెగిపోయినా పట్టించుకున్న నాథుడు లేదు.



బొగ్గు గనులను తలపిస్తున్న గూడరేవుపల్లె ఆది కుంట చెరువు

వాయల్పాడుకు రెండుసార్లు ఉప ఎన్నిక



నల్లారి అమరనాథ రెడ్డి

కలికిరి, ఏప్రిల్ 22: కొత్తగా పీలేరు నియోజకవర్గ రాకముందున్న వాయల్పాడు నియోజకవర్గానికి రెండు పర్యాయాలు ఉప ఎన్నికలు జరిగాయి. ఒకే వ్యక్తి కారణంగా ఈ రెండు ఉప ఎన్నికలు జరగడం విశేషం. అప్పటికే రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉన్న సీనియర్ నాయకుడు పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి 1962 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆయనకు ప్రత్యర్థిగా ఓ నూనూగు మీసాల యువకుడు ఆయనతో తలపడేందుకు సిద్ధమయ్యారు. ఆయనే ప్రస్తుత కలికిరి మండలం నగరిపల్లెకు చెందిన నల్లారి అమరనాథ రెడ్డి (ప్రస్తుత బీజేపీ ఎంపీ అభ్యర్థి, మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి, పీలేరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కిశోర్‌కుమార్ రెడ్డి తండ్రి). అమరనాథరెడ్డి ఎన్నికల గుర్తు ఏనుగు. అప్పట్లో కాసు బ్రహ్మానంద రెడ్డి, నీలం సంజీవ రెడ్డి వంటి ఉద్ధండుల కోటరీలో ప్రధానంగా ఉన్న తిమ్మారెడ్డి అనూహ్య రీతిలో అమరనాథరెడ్డి చేతిలో ఓడిపోయారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన అమరనాథ రెడ్డి 643 ఓట్ల మెజారిటీ సాధించారు. అనంతరం కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రయ్యారు. తిమ్మారెడ్డి ఓటమిని జీర్ణించుకోలేక అమరనాథ రెడ్డికి పోటీ చేయడానికి అవసరమైన 25 ఏళ్ల వయసు లేని కారణంగా ఆయన ఎన్నికను రద్దు చేయాల్సిందిగా కోర్టులో కేసు వేశారు. అధికార పార్టీ నాయకుల ప్రయత్నాల కారణంగా అమరనాథ రెడ్డికి సరైన రికార్డులు అందుబాటులో లేకపోవడంతో ఆయన ఎన్నిక రద్దయ్యింది. దీంతో 1965లో వాయల్పాడుకు ఉప ఎన్నిక జరగడం సరైన పోటీ లేకపోవడంతో కాంగ్రెస్ తరపున తిమ్మారెడ్డి గెలవడం జరిగిపోయింది. అయితే 1972లో కాంగ్రెస్ టికెట్టు సాధించిన అమరనాథరెడ్డి మళ్లీ గెలిచారు. తరువాత 1978లో మరోసారి గెలిచి మంత్రిగా పనిచేశారు. అనంతరం 1985లో ఏపీ అసెంబ్లీకి జరిగిన మధ్యంతర ఎన్నికల్లో అమరనాథ రెడ్డి వాయల్పాడు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అయితే 1987లో ఆయన ఆకస్మికంగా మరణించడంతో రెండోసారి వాయల్పాడు నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఒకే వ్యక్తి కారణంగా ఒక నియోజకవర్గంలో రెండు ఉప ఎన్నికలు జరగడం అరుదైనదిగా చెబుతారు.

గంజాయి వనమే.. తిరిగి తులసివనమైంది



మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట, ఏప్రిల్ 22: ఐదేళ్ల కిందట తెలుగుదేశం పార్టీ అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి వైసీపీలోకి వెళుతూ ఓ పెద్ద సంచలన ప్రకటన చేయడంతో తెలుగు రాష్ట్రాల్లోనూ బాంబులా ఆ మాట పేలిపోయింది. అదేంటంటే.. తెలుగుదేశం పార్టీ నుంచి వైసీపీలోకి పోవడం గంజాయి వనం నుంచి.. తులసివనంలోకి వెళ్లినట్లుంది.. అని సంచలానాత్మక ప్రకటన చేశారు మేడా. ఇది అప్పటి నుంచి ఇప్పటి వరకు అందరి నోటా సందర్భాన్ని బట్టి వింటున్న మాటే.. ఇంతలో మేడా మల్లికార్జునరెడ్డి నాడు ప్రకటించిన ప్రకటన ప్రకారం తాను గంజాయి వనం నుంచి తులసివనంలోకి పోయినట్లుంది అన్న మాట ఇప్పుడు రివర్స్ అయ్యింది. నాడు మేడా ప్రకటించిన ప్రకటన ప్రకారం తాను ఆనాడు భావించిన తులసివనంలో అత్యంత చేదు అనుభవం ఎదురైంది. రెడ్ల సామాజికవర్గంలో అంగబలం, అర్థబలం అన్నీ ఉన్నా కూడా టికెట్టు రాని వారు ఎవరైనా ఉన్నారంటే అది మేడా మాత్రమే. ఈ సమయంలో తనకు టికెట్టు రాకపోవడంతో ఆయన పడుతున్న బాధ ఇంతా అంతా కాదు. తన రాజకీయ ప్రత్యర్థి అయిన ఆకేపాటి అమర్‌నాథరెడ్డికి టికెట్టు కేటాయించడం ఆయనకు ఏమాత్రం రుచించలేదు. తాను అనుకున్న తులసివనమే అసలైన గంజాయి వనం అనుకుని నిజాన్ని తెలుసుకున్నట్లున్నారు. మనం అనుకున్నది ముమ్మాటికి తప్పు అని తలచినట్లున్నారు. ఇప్పుడు తన నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రధానమైన తన నేతలందరినీ తెలుగుదేశం పార్టీలోకి చేర్పించి అదే నిజమైన తులసివనమని చెప్పకనే చెప్పినట్లైంది. ఇది అందరినోటా నేడు ఆసక్తిగా మారింది.

ఈశాన్యం నుంచే ఎన్నికల ప్రచారం

- కాశీరావుపేట ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు
- 20 ఏళ్లుగా అభ్యర్థులకు ఇదే సెంటిమెంట్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 22: ఎన్నికల్లో పోటీ అంటేనే నాస్తికులకు కూడా దైవభక్తి పుట్టుకొస్తుంది. శుభమా అని ఎన్నికల ప్రచారం చేయడానికి మదనపల్లె నియోజకవర్గంలో 20 ఏళ్ల పలు రాజకీయ పార్టీల అభ్యర్థులు నియోజకవర్గానికి ఈశాన్య దిశ నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్నారు. ముఖ్యంగా మదనపల్లె మండలం కాశీరావుపేట గ్రామం వద్ద వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో ఎన్నికల కరపత్రాలు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అక్కడి నుంచే అభ్యర్థులు ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్నారు. మదనపల్లె నియోజకవర్గంలో మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాలతో పాటు పట్టణం కలసి ఉంది. ఈ నియోజకవర్గానికి ఈశాన్యం వైపున మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ కాశీరావుపేట గ్రామం ఉంది. జాతీయ రహదారి పక్కనే వెలసిన అంజనేయస్వామి ఆలయం చాలా మందికి సెంటిమెంట్‌గా మారింది. 2004లో ఎన్నికల ప్రచారం సందర్భంగా టీడీపీ అభ్యర్థి దొమ్మలపాటి రమేశ్ ఇక్కడి నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభించి విజయం సాధించారు. 2009లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా కూడా ఈ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ఇక్కడి నుంచే ప్రచారం ప్రారంభించి విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి దేశాయ్ తిప్పారెడ్డి కాశీరావుపేట ఆంజనేయస్వామి ఆలయం నుంచే ఎన్నికల ప్రచారం చేసి గెలిచారు. ఇదిలా ఉండగా 2024 సంవత్సరంలో ప్రస్తుతం జరిగే ఎన్నికల సందర్భంగా టీడీపీ టికెట్ దక్కించుకున్న షాజహాన్‌బాషా మంగళగిరి నుంచి నేరుగా తిరుపతి మీదుగా వచ్చి ఈశన్య దిశలో నియోజకవర్గంలో అడుగుపెట్టి కాశీరావుపేట ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేసి తన సెంటిమెంట్‌ను నిలుపుకున్నారు. దీనిని చూసి వైసీపీ అభ్యర్థి నిస్సార్ అహ్మద్ కూడా ఇక్కడి నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇలా 20 ఏళ్లుగా అభ్యర్థులు ఈశాన్య దిక్కులో ప్రచారం ప్రారంభించడం సెంటిమెంట్‌గా మారింది.

- సెంటిమెంటు




మదనపల్లె నియోజకవర్గం ఈశాన్య దిక్కున వెలసిన కాశీరావుపేట ఆంజనేయస్వామి ఆలయం

దేశసేవ + ప్రజాసేవ = కృష్ణారెడ్డి

- ప్రజల మనిషిగా గుర్తింపు

సుండుపల్లె, ఏప్రిల్ 22: దేశ రక్షణే కాదు జన్మనిచ్చిన పేద ప్రజలకు మంచి చేయాలన్న సంకల్పంతో కెప్టెన్ మిన్నమరెడ్డి కృష్ణారెడ్డి కృషి ఎనలేనిది. మారుమూల సుండుపల్లె మండలం నుంచి దేశ రక్షణ వలయానికి కెప్టెన్‌గా వ్యవహరించడం ఒక మిన్నమరెడ్డి కుటుంబానికి దక్కిన వరం. అయితే అలాంటి వ్యక్తి రాయచోటి నియోజకవర్గ ప్రజలకు సేవలందించడం అంటే నియోజకవర్గ ప్రజలు చేసుకున్న అదృష్టమనే చెప్పాలి. పీలేరు నియోజకవర్గ మిన్నమరెడ్డిగారిపల్లెకు చెందిన రాఘవరెడ్డి పార్వతమ్మల కుమారుడే మిన్నమిరెడ్డి కృష్ణారెడ్డి చరిత్రలో ఒక అధ్యాయాన్ని లిఖించారు. 1937 సంవత్సరంలో బ్రిటీష్ ప్రభుత్వం చట్టబద్ధంగా పాలన నిర్వహించేందుకు ప్రయత్నాలు సాధించింది. అందుకు తొలిమెట్టు దేశవ్యాప్తంగా 1937లో కేంద్ర ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్న సమయంలో మిన్నమరెడ్డి కృష్ణారెడ్డి మిలిటరీలో చేరారు. ఆ సమయంలో మిలిటరీలో పనిచేయడమే కాదు బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా మాట్లాడితేనే కఠిన శిక్షలు పడే సమయంలో దేశం కోసం ఆయన చేసిన కృషిని ఎవరూ మరిచిపోరు. అనంతరం మిలటరీలో అనేక ఉన్నత పదవులు అలంకరించి కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించి దేశ రక్షణ దళానికి ఆయన దిక్సూచిగా మారారు. అలాంటి వ్యక్తి రాయచోటి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి 1967 సంవత్సరంలో గెలుపొంది 1972వ సంవత్సరం వరకు ఎమ్మెల్యేగా ప్రజలకు విశేష సేవలందించారు. ప్రజలకు మంచి చేయడంతో ఆయనకు ఎనలేని గుర్తింపు లభించింది. ఆయనతో పాటు ఆయన కుటుంబానికి సైతం గుర్తింపు వచ్చింది. ప్రస్తుతం ఆయన సతీమణి పార్వతమ్మ సుండుపల్లెలోని వారి కుమారుడు గంగిరెడ్డి వద్ద నివాసం ఉంటున్నారు. వారి కుటుంబ సభ్యులు ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నారు.





కృష్ణారెడ్డి (ఫైల్), కృష్ణారెడ్డి సతీమణి పార్వతమ్మ

ప్రజల కోసం ఎమ్మెల్యే అయ్యాడు

- పార్వతమ్మ, కెప్టెన్ కృష్ణారెడ్డి సతీమణి

దేశ రక్షణ కోసం మిలటరీలో పనిచేశాడు. అప్పట్లో మిలటరీలో చేరడాన్ని మేమందరం వద్దన్నా దేశం కోసం చేరాడు. మిటరీలో పనిచేసేటప్పుడు చాలా గర్వంగా ఉందని చెప్పేవాడు. అదే రీతిలో మంచి హోదా దక్కింది. వయసు పెరిగే కొద్దీ స్థానిక ప్రజలకు సేవ చేయాలని భావించాడు. అదే అదునుగా ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం వచ్చింది. ప్రజలు అఖండ మెజార్టీతో గెలిపించారు. ఎక్కడ చూసినా మంచి గుర్తింపు.. ఆ గుర్తింపు మిటరీలో పనిచేయడం వల్లనే లభించింది. డబ్బు కంటే మంచితనానికి, హోదాకు ప్రజలు అప్పట్లో ఆదరించారు. సుండుపల్లె మండలం కూడా అప్పుడు రాయచోటి నియోజకవర్గంలోనే ఉండేది. ఆయన ప్రజలకు చేసిన మంచే ఇప్పుడు మాకు ఎంతో గౌరవాన్ని ఇస్తోంది. ఆనాటి రాజకీయాలు స్వేచ్ఛగా ఉండేవి. ఇప్పుడు అలా లేవు.

రాజకీయాల్లో ఆత్మహత్యలే గానీ హత్యలుండవు...



రాజంపేట, ఏప్రిల్ 22: రాజకీయంగా ఎంతో ఉద్ధండులైన నాయకులు.. ఒకచోట కూర్చున్నారు. ఏడు పదుల వయస్సులో నాటి.. నేటి రాజకీయాలపై వారిద్దరూ నెమరు వేసుకున్నారు. ఈ విషయం చాలా ఆసక్తి గొల్పించింది. ఎప్పుడైనా అప్పటి నుంచి ఇప్పటి వరకు 50 ఏళ్ల రాజకీయాన్ని ఒకసారి తిరగేస్తే రాజకీయాల్లో హత్యలుండవు.. ఆత్మహత్యలే తప్ప అని అనుకున్నారు. ఏమిటీ.. అని ఆలోచిస్తే రాజకీయాల్లో సర్వం పోగొట్టుకుని, కుటుంబాన్ని వదిలి, రాత్రింబవళ్లు కష్టపడి, ఉన్నదంతా పోగొట్టుకొని ఫలానా పదవి కావాలని పోటీ పడితే అది వచ్చేది లేదు.. సచ్చేది లేదు. ఒకప్పుడు రాజకీయాలు విలువలతో కూడుకుని ఉండేవి.. ప్రజాసేవ కోసమే ఈ రంగంలోకి ఉన్నత మనస్తత్వం కలిగిన వ్యక్తులు వచ్చేవారు.. ఇప్పుడు ఇది వ్యాపారమైపోయింది. ఒక ఎమ్మెల్యే టికెట్టు అంటే రూ.50 కోట్లు పెట్టే పరిస్థితి వచ్చింది. టికెట్టు అడగాలంటేనే ఐదేళ్లు కష్టపడి పదికోట్లైనా ఖర్చు పెడితే ఎమ్మెల్యే స్థాయికి ఎదిగేది.. ఒక టికెట్టు కోసం పది మంది పోటీ పడి తలా పదికోట్లు పోగొట్టుకొని తీరా రాకపోతే ఏం చేస్తారు.. ఎవరూ చంపాల్సిన పనిలేదు.. వారికివారే ఆత్మహత్య చేసుకునే పరిస్థితి. ఇంతటి దుర్మార్గపు రాజకీయాలను ఎప్పుడూ చూడలేదు. గతంలో ప్రత్యర్థులుండేవారు.. ఇప్పుడలా కాదు మనకు మనమే ప్రత్యర్థులం.. ఈ రాజకీయాన్ని ఎంచుకోవడమే ఒక ఆత్మహత్య శరణ్యం.. ఇది ఒక రాజకీయ చదరంగం.. టైం బాగుండి టికెట్టువచ్చి గెలిస్తే అన్నీ బాగుంటాయి.. నూరు పనులు చేసి నూటొక్క పనిచేయకపోయినా అనరాని మాటలు, వినని బూతులు, పెట్టని శాపనార్థాలు పెట్టించుకోవాల్సి వస్తుంది. గెలిస్తే.. అట్ల ఇబ్బంది పడాలి.. టికెట్టు రాక, వచ్చినా గెలవకపోతే మదనమదనపడి చేసిన అప్పులు తీర్చుకోలేక ఇబ్బంది పడాల్సి వస్తుంది. గెలిచినా అదే.. గెలవకపోయినా అదే శిక్ష.. అందుకే రాజకీయాల్లో ఆత్మహత్యలు తప్ప హత్యలుండవు అని సెలవిచ్చారు పెద్దలు.

హ్యాట్రిక్ సాధించిన కిరణ్‌కుమార్‌రెడ్డి



కిరణ్‌కుమార్ రెడ్డి

కలికిరి, ఏప్రిల్ 22: వాయల్పాడు, అనంతరం పునర్వ్యవస్థీకరించిన పీలేరు నియోజకవర్గాలకు సంబంధించి ఒకే ఒక్కరు మూడు పర్యాయాలు వరుసగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. ఆయనే మాజీ సీఎం, ప్రస్తుత రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి. 1989 నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించి అదే ఏడాది ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తరువాత 1994లో ఓడిపోయారు. అనంతరం 1999, 2004లో కూడా వాయల్పాడు ఎమ్మెల్యేగా గెలుపొందారు. తరువాత నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ జరగడంతో వాయల్పాడు బదులు పీలేరుగా పేరు మారింది. 2009లో కిరణ్‌కుమార్‌రెడ్డి మూడవసారి వరుసగా ఎన్నికయ్యారు. నియోజకవర్గ చరిత్రలో హ్యాట్రిక్ సాధించిన వ్యక్తిగా నమోదయ్యారు.

నాలుగో రోజు 44 నామినేషన్లు దాఖలు


నామినేషన్ దాఖలు చేస్తున్న పుట్టా సుధాకర్ యాదవ్

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 22: సార్వత్రిక ఎన్నికలకు సోమవారం నాలుగో రోజు జిల్లా వ్యాప్తంగా 44 నామినేషన్లు దాఖలయ్యాయి. కడప పార్లమెంట్ స్థానానికి 6, అన్ని నియోజకవర్గాల్లో 38 నామినేషన్లు దాఖలు చేశారు. కడప పార్లమెంట్ అభ్యర్థిగా రాయలసీమ రాష్ట్ర సమితి తరపున ఆ పార్టీ వ్యవస్థాపకుడు కుంచం వెంకట సుబ్బారెడ్డి, జాతీయ కాంగ్రెస్ తరఫున వైఎస్ షర్మిలారెడ్డి, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ వేణుగోపాల్, స్వతంత్ర అభ్యర్థిగా ఖాజా హుసేన్, ఇండిపెండింట్ అభ్యర్థిగా కుడముల వెంకటసుబ్బారెడ్డి నామినేషన్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ రామరాజుకు సమర్పించారు. బద్వేలు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా విజయజ్యోతి, వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ సుధా, బీజేపీ అభ్యర్థిగా బొజ్జా రోశన్న కుమారుడు కార్తీక్ రోషన్, స్వతంత్ర అభ్యర్థిగా మద్దెల మల్లికార్జునరావు, కడప అసెంబ్లీకి శెట్టిపల్లి సుబ్రమణ్యం, షేక్ అలీషేర్, పట్టుపోగుల పవన్‌కుమార్, అవ్వారు మల్లికార్జున నామినేషన్లు దాఖలు చేశారు. కమలాపురం అసెంబ్లీ వైసీపీ అభ్యర్థిగా పి.రవీంద్రనాథ్ రెడ్డి రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థిగా నరెడ్డి కిశోర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పాముల బ్రహ్మానందరెడ్డి, సీపీఐ అభ్యర్థిగా గాలి చంద్ర, పులివెందుల నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరుపున వైఎస్ మనోహర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. జైనేషనల్ పార్టీ తరుపున డి.రవిశంకర్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా గవిరెడ్డి రామేశ్వరరెడ్డి, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా బెల్లం ప్రవీణ్ కుమార్‌రెడ్డి, జమ్మల మడుగ వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ సుధీర్ రెడ్డి 2 సెట్లు, ఇండిపెండింట్ అభ్యర్థిగా రామేశ్వరరెడ్డి, మూలే క్రాంతిప్రియ (వైసీపీ), ఇండిపెండింట్ అభ్యర్థిగా ప్రమోద్ కుమార్, నగబాల రామాంజనమ్మ, ఇండిపెండింట్ వెంకటసుబ్బారెడ్డి, ప్రొద్దుటూరు వైసీపీ అభ్యర్థిగా రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, బీఎస్పీ అభ్యర్థిగా పిచ్చోళ్ల సుబ్బరాయుడు, కాంగ్రెస్ అభ్యర్థిగా పూల నజీర్, చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ అభ్యర్థిగా సురేష్ బాబు, మైదుకూరు టీడీపీ అభ్యర్థిగా పుట్టా సుధాకర్ యాదవ్, పుట్టా రవికుమార్ యాదవ్(టీడీపీ), వైసీపీ అభ్యర్థిగా శెట్టిపల్లి రఘురామిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా గుండ్లకుంట శ్రీరాములు, బీఎస్పీ నుంచి దాసరి జయరాం, స్వతంత్ర అభ్యర్థిగా ఆవుల వెంకటరమణ, బీఎస్పీ నుంచి కళ్యాణ్, జైభారత్ నేషనల్ పార్టీ లెక్కల శ్రీనివాసుల రెడ్డిలు నామినేసన్లు దాఖలు చేశారు.

ఎమ్మెల్సీ ఇస్తానని జగన్ మాటతప్పారు

అవమానాలు తట్టుకోలేక కాంగ్రెస్ గూటికి ● కడప కాంగ్రెస్ అభ్యర్థి అఫ్జల్‌ఖాన్



కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 22: వైసీపీ కష్టకాలం నుంచి 14 ఏళ్ల పాటు జగన్ వెంట నమ్మి నడిస్తే నన్ను ఆదరించలేదు.. ఈ ఐదేళ్లలో తాను ఎమ్మెల్యే అంజాద్‌బాషా సీఎంను కలవనీయలేదు.. ఇక ముస్లిం మైనార్టీల మనోభావాలను దెబ్బతీసే విధానాలకు జగన్ మద్దతు పలకడంతో విసిగిపోయి, అవమానాలు తట్టుకోలేక పార్టీ వీడి కాంగ్రెస్ పార్టీలో చేరానని కడప నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి అఫ్జల్‌ఖాన్ స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనాదిగా తాను వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి విధేయుడినని అన్నారు. ఆయన మరణాంతరం తనయుడు జగన్‌తో కలసి పార్టీ కోసం పని చేస్తే 2009, 2014లో టిక్కెటు దక్కలేదు. ఎమ్మెల్సీ ఇస్తానని హామీ ఇచ్చి మాట తప్పారని ఆరోపించారు. సీఏఏ, ఎన్ఆర్‌సీ, తలాక్ బిల్లుల విషయంలో జగన్ మద్దతు పలకడం కలచి వేసిందన్నారు. ఐదేళ్లలో సీఎంను కలసి ముస్లిం, మైనార్టీల సమస్యలను తెలపాలని వేచి చూశా. డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా ముఖ్యమంత్రిని కలవకుండా చేశారని విమర్శించారు. 2000 నుంచి 2024 వరకు పాతికేళ్ల వైఎస్ కుటుంబానికి విధేయుడిగా నడిస్తే.. జగన్ ప్రభుత్వంలో నమ్మిన వాని కంటే.. నమ్మించే వాళ్లకు ప్రాధాన్యత, పదవులు ఉంటాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

టీడీపీ హయాంలో హజ్ హౌస్ నిర్మిస్తే ముస్లింల పక్షపాతిగా చెప్పే సీఎం జగన్ రూ.20కోట్లు కేటాయించక పోవడం శోచనీయమన్నారు. పవిత్ర హజ్‌కు వెళ్లే యాత్రికులకు ఆశ్రయం ఇచ్చే హజ్ భవన్ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందన్నారు. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా యువతీ, యువకులకు ఉపాధి కోసం రుణాలిచ్చే పద్ధతికి చరమగీతం పాడారని, వక్ఫ్‌బోర్డు స్థలాలు అన్యాక్రాంతం అవుతుంటే చోద్యం చూస్తున్నారని, అమాయకులైన మైనార్టీలను అభివృద్ధికి దూరం చేశారని జగన్ పాలనపై విరుచుకుపడ్డారు. చివరికి సొంత చెల్లెలు షర్మిలకు అన్యాయం చేశారని, చిల్లర నేతలు వైఎస్ఆర్ గౌరవం దెబ్బతీసేలా కామెంట్లు చేస్తున్నా జగన్ స్వార్థ రాజకీయాల కోసం చర్యలు లేకపోవడం చూస్తే వైఎస్ కుటుంబం నమ్మిన బంటుగా బాధేస్తుందన్నారు. కాంగ్రెస్‌పార్టీలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని, అందుకే కడప కాంగ్రెస్ అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిని వైఎస్ షర్మిలమ్మను ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అఫ్జల్ ఖాన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు విష్ణు ప్రీతంరెడ్డి, పీసీసీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు అలీఖాన్, సలావుద్దీన్, ఎంపీ సురేష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాతారెడ్డి, మధురెడ్డి, పుల్లయ్య, లక్ష్మయ్య, బాబు, చంటి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి దారుణ హత్య

● దారి కాచి ఒకరిని.. ఇంటికెళ్లి మరొకరిని..

● హత్య చేసిన గుర్తుతెలియని వ్యక్తులు


హత్యకు గురైన వెంకటరాయుడు - మాబున్ని

చిన్నమండెం, ఏప్రిల్ 21: చిన్నమండెం మండలంలో సోమవారం రాత్రి దారుణం చోటు చేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తులు దారికాచి ఒకరిని, ఇంటికి వెళ్లి మరొకరని కత్తులతో విచక్షణా రహితంగా పొడిచి హత్య చేశారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. చిన్నమండెం మండలం దిగువగొట్టివీడు పంచాయతీలోని కమ్మపల్లెకు చెందిన రేషన్ డీలర్ చల్లపల్లె వెంకటరాయుడు(60) సోమవారం రాత్రి ద్విచక్రవాహనంలో వెళుతుండగా చాకిబండ, గొట్టివీడు మార్గమధ్యలోని పోలిమేరమ్మ గుడివద్ద ఆటోలో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు ఢీకొట్టారు. దీంతో కిందపడ్డ వెంకటరాయుడుపై కత్తులతో పొడిచి హత్య చేశారు. అనంతరం అక్కడికి మూడు కిలోమీటర్ల దూరంలోని ఎగువబలిజపల్లెకు చేరుకున్నారు. ఆ గ్రామంలో నివాసం ఉంటున్న మాబూన్ని (50)ని సైతం కత్తులతో పొడిచి చంపి వెళ్లిపోయారు. వీరిద్దరూ హత్యకు గురైన విషయం ఆలస్యంగా గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. చిన్నమండెం ఎస్ఐ రమేశ్‌బాబు, రాయచోటి రూరల్ సీఐ తులసీరాం, డీఎస్పీ మహబూబ్‌బాషా సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ విషయంపై డీఎస్పీని వివరణ కోరగా హత్యకు గల కారణాలు ఇంకా తెలియలేదని, దీనిపై విచారణ చేపడుతున్నామన్నారు. కాగా.. ఈ హత్యలకు పాతకక్షలు కారణమా.. లేక మరేవైనా కారణాలా అన్నది తెలియలేదు.

యువకుడు ఆత్మహత్య


షేక్ ఆల్తాఫ్ మృతదేహం

నందలూరు, ఏప్రిల్ 22: అరవపల్లె ఆర్ఎస్ రోడ్డులోని పోలీస్ స్టేషన్‌కు ఎదురు వీధిలో సయ్యద్ ఆల్తాఫ్ (22) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం చోటు చేసుకున్న సంఘటనపై సోమవారం ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ మాట్లాడుతూ తండ్రి బాషా సాహెబ్ మరణించడంతో తల్లి, కొడుకు ఇద్దరూ ఒకే ఇంట్లో ఉండగా మృతుడు సయ్యద్ ఆల్తాఫ్ తరచూ గొడవ పడుతుండడంతో తల్లి మందలించింది. దీంతో మృతుడు ఉరి వేసుకున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుండెకు, ఊపిరితిత్తులకు మధ్యలో బుల్లెట్లు

● అరుదైన శస్త్రచికిత్సతో ప్రాణాలు కాపాడిన రుయా వైద్యులు


బాధితుడి వివరాలు తెలియజేస్తున్న వైద్యాధికారులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 22: గుండెకు, ఊపిరితిత్తులకు మధ్యలో శరీరంలోకి రెండు బుల్లెట్లు దిగిన ఓ వ్యక్తి ప్రాణాలను తిరుపతి రుయా ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి కాపాడారు సోమవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభు మీడియాకు వివరాలు తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం పసలవాండ్లపల్లికి చెందిన విశ్వనాథ్‌పై కుటుంబ కలహాలతో సొంత అన్న నాటు తుపాకీతో కాల్చాడు. దీంతో విశ్వనాథ్ శరీరంలోకి రెండు బుల్లెట్లు దూసుకెళ్లాయి. బాధితుడిని కుటుంబీకులు 18వ తేదీన రుయా ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించగా గుండెకు, ఊపిరితిత్తులకు మధ్యలో రెండు బుల్లెట్లు ఉన్నాయని గుర్తించారు. వెంటనే కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ కళ్యాణి రమ ఆధ్వర్యంలో ఆధునిక పెరికాడియంలో పద్ధతిలో శస్త్రచికిత్స చేసి బుల్లెట్లను తొలగించారు. బాధితుడు పూర్తి ఆరోగ్యంగా కోలుకున్నాడు. ఇటువంటి సర్జరీ చేయడం సాధారణం విషయం కాదని, బుల్లెట్లను తొలగించే క్రమంలో ఒక్కోసారి రోగి ప్రాణాలు కూడా కోల్పోయే అవకాశం ఉందని సూపరింటెండెంట్ తెలిపారు. ఏఆర్ఎంఓ డాక్టర్ హరికృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 అరుణమ్మ, క్లినికల్ పర్ఫ్యూజనిస్టు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత గంప శివ ఇంట్లో పోలీసుల సోదాలు


టీడీపీ నేత దొంతం శివ ఇంట్లో సోదా చేస్తున్న పోలీసులు

రాజంపేట, ఏప్రిల్22: స్థానిక నూనెవారిపల్లె రోడ్డులో నివసించే టీడీపీ యువనేత, ప్రముఖ రియల్టర్ దొంతం శివ (గంప శివ) ఇంట్లో పట్టణ సీఐ మద్దయ్య ఆచారి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సోదాలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో కొందరు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందితో కలిసి పట్టణ సీఐ మద్దయ్య ఆచారి, ఫ్లయింగ్ స్క్వాడ్ మహిళా అధికారి సుజామణి తదితరులు ఈ సోదాలో పాల్గొన్నారు. అతని స్వగృహంలో కోట్ల రూపాయలు డబ్బు దాచివున్నారన్న ఆరోపణతో ఈ సోదాలు నిర్వహించారని తెలిసింది. ఇంట్లో మొత్తం సోదాలు నిర్వహించారు. అయితే అతని ఇంట్లో ఎటువంటి నగదు దొరకకపోవడం వెనుదిరిగినట్లు తెలిసింది. ఈ విషయమై దొంతం శివను వివరణ కోరగా ఎవరో కావాలనే తనపై ఫిర్యాదు చేసి పోలీసుల చేత సోదాలు చేయించారని తమ ఇంట్లో ఎటువంటి నగదు దొరకకపోవడం వెనుదిరిగి వెళ్లారన్నారు. ఈ విషయమై పట్టణ సీఐ వివరణ కోసం అనేక సార్లు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు..

తూనికలు తేడా వస్తే చర్యలు తప్పవు

రైల్వేకోడూరు, ఏప్రిల్22: వినియోగదారులకు తూనికల కొలతల్లో తేడా జరిగితే కఠిన చర్యలు తప్పవని తూనికల శాఖ అధికారి రవీంద్రారెడ్డి హెచ్చరించారు. సోమవారం వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణంలోని మల్లెంకొండ పెట్రోలు బంక్‌లో తనిఖీ చేపట్టారు. పెట్రోలు బంక్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేయడానికి వచ్చామన్నారు. తనిఖీల్లో తేడాలు కనిపిస్తే పెట్రోలు బంక్‌ను నిర్వహిస్తున్న యజమానిపై చర్యలు తీసుకుంటామని, జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

వైసీపీ సమావేశానికి పంచాయతీ ట్యాంకర్


వైసీపీ సమావేశం ప్రాంగణం వద్ద పంచాయతీ ట్యాంకర్

వాల్మీకిపురం, ఏప్రిల్ 22: తిరుపతి రోడ్డులో సోమవారం నిర్వహించిన వైసీపీ కార్యకర్తల సమావేశానికి పంచాయతీ నీటి ట్యాంకర్‌ను వాడుకున్నారు. కార్యకర్తల సమావేశం ప్రాంగణం వద్ద పంచాయతీ నీటి ట్యాంకర్ కనిపించడంతో వ్యవహారం జిల్లా అధికారుల దాకా వెళ్లింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో స్థానిక అధికారులు సైతం జిల్లా అధికారుల ఆదేశాలతో అప్రమత్తమయ్యారు. ఈ విషయమై ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డిని వివరణ కోరగా సమావేశం ప్రాంగణం వద్ద పంచాయతీ ట్యాంకర్‌ను గమనించి అప్పటికప్పుడే తొలగించామన్నారు.

వేధింపులతో మూతపడిన మద్యం షాపులు

పోలీసుల వేధింపులు తట్టుకోలేక పనిచేయలేమంటున్న సేల్స్‌మెన్లు

లక్కిరెడ్డిపల్లె ఏప్రిల్21: మండలంలో రెండు బ్రాందీషాపులు ఉన్నాయని అందులో ఎన్నికల వేల రోజూ లక్షల రూపాయలు వ్యాపారం సాగుతోంది. అయితే సోమవారం ఉన్నట్టుండి మధ్యాహ్నం నుంచి బ్రాందీ షాపులు మూతపడ్డాయి. దీంతో మందుబాబులు షాపుల వద్ద తొక్కిసలాడారు. విషయానికి వస్తే రెండుషాపుల సేల్స్‌మెన్లును లక్కిరెడ్డిపల్లె పోలీసులు వేధిస్తున్నారని దీంతో స్టేషన్‌కు పిలిపించి దుర్భాలలాడారని సేల్స్‌మెన్లు వాపోయారు. మందుబాబులపై కేసులు నమోదు చేసేలా సహకరించాలని లేదంటే మీపై కేసులు బనాయిస్తామని పోలీసులు బెదిరించారని సేల్స్‌మెన్లు ఆరోపించారు. ప్రభుత్వ ధరలకు మద్యం విక్రయిస్తున్నామని వ్యక్తికి మూడు బాటిల్లు మాత్రమే ఇవ్వాలని నిబనంధనలు పాటిస్తూన్నా, ఎక్కువ ఇవ్వాలని పోలీసులు ఇబ్బందులు పెడుతున్నారని వివరించారు. షాపుల వద్ద పోలీసు ఇన్ఫార్మర్లు మమ్మలను వేధిస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు ఆదేశాలమేరకే ప్రభుత్వ ధరలకు మద్యం విక్రయిస్తున్నామని మాపై పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేయడం సభబుకాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పోలీసుల వేధింపుల గురించి స్టేట్ బేవరేజ్ కార్పొరేషన్ కడప డీఎంకి విషయాన్ని తెలియజేసి మద్యంషాపులను మూసివేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ విషయం పోలీసుల తీరుపై ఎస్పీ క్రిష్ణారావుకు ఫోన్‌ద్వారా సమాచారాన్ని అందించామని సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ విష్ణువర్ధన్‌ను వివరణ కోరగా లక్కిరెడ్డిపల్లె మద్యం షాపులు రెండింటిలోనూ మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని దీంతో రెండు మద్యం షాపుల వద్ద ఇన్ఫార్మర్ కానిస్టేబుల్స్ నియమించామని వారిని రోజూ ఇక్కడ షాపుల వద్ద మీకేం పని వెళ్లిపోండి అని సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లు ఇన్ఫార్మర్లును బెదిరిస్తున్నారని తెలిపారు. దీంతో రెండుషాపుల సిబ్బందిని పిలిపించి మందలించాను అని ఎస్ఐ వివరణ ఇచ్చారు.

వైసీపీకి అంబటి క్రిష్ణారెడ్డి రాజీనామా

బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం ● తీవ్ర అన్యాయం చేశారని ఆరోపణ


సురేష్‌బాబుకు రాజీనామా పత్రం ఇస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 22: వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయ మాజీ ప్రధాన సలహాదారు, తిప్పలూరు సర్పంచి అంబటి క్రిష్ణారెడ్డి సోమవారం వైసీపీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. తన రాజీనామా పత్రాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబుకు సమర్పించినట్లు తెలిపారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాం నుంచి తాను పార్టీ అభివృద్ధికి కృషిచేసినట్లు తెలిపారు. జగన్‌పార్టీని వీడి చాలా మంది వెళ్లినా తాను మాత్రం జగన్ వెంటే ఉన్నానన్నారు. అయితే జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవి కోసం తాను భారీగా డబ్బు పోగొట్టుకున్నట్లు తెలిపారు. ఆ పదవి ఇవ్వకుండా అన్యాయం చేశారన్నారు. ప్రభుత్వ వ్యవసాయ ప్రధాన సలహాదారునిగా నియమించారన్నారు. అయితే ఈవిషయంలో కూడా తనకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. అందరికీ పదవులు రెన్యువల్ చేసినా తన కు మొండిచేయి చూపారన్నారు. దీంతో అనేక సార్లు సీఎంను కలిసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఎమ్మెల్యేను కాద ని ఎంపీ ఏమీ చేయడని, అలాగే ఎంపిని కాదని సీఎం కూడా ఇక్కడ కార్యకర్తలకు, నేతలకు ఏమీ చేయడం లేదన్నారు. తన పదవీ కాలం పొడగింపును అడ్డుకుంది ఎమ్మెల్యేనే అని ఆయన ఆరోపిస్తున్నాడు. త్వరలో తన రాజకీయ భవిష్యత్తుపై కార్యా చరణ ప్రకటిస్తానన్నారు. అయితే అతి త్వరలో ఆయన బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరనున్నట్లు విశ్వసనీయ సమాచారం. తిప్పలూరులో పట్టున్న నేత అంబటితో తిప్పలూరులో వైసీపీకి భారీ గండిపడే అవకాశం ఉంది.

వైభవోపేతం వీరభద్రుడి పల్లకీ ఉత్సవం


వీరభద్రాలయంలో పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, ఏప్రిల్22: దక్షిణకాశీగా పేరుగాంచిన భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్‌పర్సన్ పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేద మంత్రోచ్ఛారణల మధ్య భద్రకాళీ సమేత వీరభద్రుడు ఉత్సవ విగ్రహాలను అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంక రించి పల్లకీ ఉత్సవంపై ఆలయం చుట్టూ మాడవీధుల్లో ప్రదక్షిణలు నిర్వహించారు. పట్టణ భక్తులు, కన్నడ భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అర్చక స్వాములు ఆలయానికి వచ్చిన భక్తులందరికీ అర్చనలు చేసి తీర్థప్రసాదాలు అందించారు.

ప్లాస్టిక్‌తో మానవాళి మనుగడకు దెబ్బ


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న జ్ఞానాంబిక విద్యార్థులు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 22: మానవాళి మనుగడను ప్లాస్టిక్ వినియోగం ఎక్కువగా దెబ్బతీస్తోందని పేస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వీఎస్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల, పేస్ సంస్థ సంయుక్తంగా మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ సౌజన్యంతో నిర్వహించిన ధరిత్రి దినోత్సవంలో భాగంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ వినియోగం తగ్గిద్దామని నినాదాలు చేశారు. కోమటివానిచెరువు కట్టపై మొలచిన పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పేస్ సంస్థ నిర్వాహకుడు ఉత్తమేశ్వరరావు, ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ పదేళ్లతో పోలిస్తే వేసవిలో ఎండలతో భూతాపం పెరిగి 45 డిగ్రీల సెంటిగ్రేడ్ ఆరెంజ్ సిగ్నల్ ఇస్తున్నారన్నారు. ఇదే కొనసాగితే మనుషులు బయట కూడా తిరగలేరన్నారు. విద్యార్థులకు ప్లాస్టిక్ వ్యర్థాల ప్రభావం అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు రూ.10 వేలు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, డాక్టర్ రమ్య, అధ్యాపకులు రెడ్డెప్ప, మునీంద్రనాయక్, శరత్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళపై మూకుమ్మడి దాడి

రామసముద్రం, ఏప్రిల్ 22: మహిళపై మూకుమ్మడి దాడి జరిగిన సంఘటన రామసముద్రంలో సోమవారం వెలుగు చూసింది. మండలంలోని దిన్నెమీద హరిజనవాడ వాసి జి.కవిత భర్త వేధింపులతో రెండు రోజుల కిందట పీటీఎంలోని పుట్టింటికి వెళ్లింది. పిల్లల బట్టలు, ఆధార్ కార్డు తీసుకురావడానికి దిన్నెమీదహరి జనవాడకు ఆదివారం వచ్చింది. దీనిని జీర్ణించు కోలేని కుటుంబీకులు రెచ్చిపోయి కవితను ఇంట్లో బంధించి మూకుమ్మడిగా దాడి చేసి చిత్రహింసలకు గురి చేశారు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన బాధితురాలు నిద్ర మాత్రలు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. 108 సిబ్బంది ఆమెను అడ్డుకుని ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చింతపర్తి పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

వాల్మీకిపురం, ఏప్రిల్ 22: చింతపర్తి పీహెచ్‌సీని సోమవారం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వేణుగోపాల్‌రావ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ల్యాబ్ పరిశీలించి రికార్డులు చూస్తూ డెంగ్యూ పరీక్షలు మరింత పెంచాలని సూచించారు. వేసవిలో వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాల న్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సన, ఆయేషా, శ్రీవిద్య, నాగభూషణం, సబ్ యూనిట్ ఆఫీసర్ ముజీబ్‌బాషా, హెల్త్ సూపర్‌వైజర్లు సుధాకర్, భాను, సీహెచ్ఓ ఇందిరారాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కమనీయం.. పట్టాభిరాముడి కల్యాణం

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 22: కందుకూరు గ్రామంలో వెలసిన పట్టాభిరాముడి కల్యాణోత్సవం సోమవారం కమనీయంగా సాగింది. భక్తులకు సింహవాహనంపై స్వామి వారు దర్శనం ఇచ్చారు. సాయంత్రం పట్టాభిరాముల కల్యాణోత్సవాన్ని రాములవారి తరపున కందుకూరుకు చెందిన కరణం ప్రకాష్‌రావ్, కరణం అభిరాం, కరణం సాంబశివరావ్, సుధాకర్‌రావ్, కరణంరామచంద్రరావ్, పాల్గొనగా సీతమ్మవారి తరుపున నరకూరి అఖిల, క్రిష్ణచైతన్య పాల్గొన్నారు.

నామినేషన్ కోసం జనసమీకరణ

పోరుమామిళ్ల, ఏప్రిల్ 22: ఎన్నికల నామినేషన్ కోసం అధికార పార్టీ జనసమీకరణ సేకరించేందుకు పోటీలు పడ్డారు. ఎక్కువ జన సమీకరణ చేసి మెప్పు పొందాలని అధికార పార్టీలో రెండు వర్గాలు పోటీ పడ్డాయి. సోమవారం బద్వేలులో అధికార పార్టీ అభ్యర్థి డాక్టర్ సుధ నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి వర్గం, అదనపు సమన్వయకర్త విశ్వనాథరెడ్డి వర్గం పోటీ పడ్డాయి. పోరుమామిళ్లలో ఎమ్మెల్సీ డీసీ వర్గం నామినేషన్‌కు వచ్చే వారికి రూ.300 నగదు, భోజనం ఏర్పాటు చేశారు. టౌన్‌లో అదనపు సమన్వయకర్త విశ్వనాథరెడ్డి వర్గీయులు రూ.500 నగదు, బిర్యాని బాక్స్‌లను అందజేశారు. ఒకే పార్టీలోని వారు వర్గాలుగా విడిపోవడంతో బలప్రదర్శనకు పోటీ పడాల్సి వచ్చింది.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు : తులసిరెడ్డి


అభ్యర్థితో ఆర్వో కార్యాలయానికి వస్తున్న తులసిరెడ్డి

మైదుకూరు, ఏప్రిల్ 22: రాష్ట్రంలోనూ, దేశంలోనూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, జగన్ పాలనపై విసుగెత్తిపోయారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా ఛైర్మెన్ నర్రెడ్డి తులసిరెడ్డి పేర్కొన్నారు. మైదుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా గుండ్లకుంట శ్రీరాములు నామినేషన్‌ను దాఖలు చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా అవినీతి, అక్రమాలు దోపిడీలు జరుగుతున్నాయని, అభివృద్ధి ఏమాత్రం పట్టించుకోలేదని, దేశంలో కూడా బీజేపీ మతతత్వ పార్టీగా పేరొందిందన్నారు. అక్కడ బీజేపీ భూస్థాపితం అవుతుందని, రాష్ట్రం, కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తున్నదని ధీమా వ్యక్తం చేశారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

వైసీపీని చిత్తుచిత్తుగా ఓడిస్తాం..

● ఆత్మీయ సభలో ఎన్డీఏ నేతల ప్రతిన

రాజంపేట, ఏప్రిల్ 22 : రాజంపేటను జిల్లా కేంద్రం చేయించేందుకు కృషి చేస్తానని రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం ప్రకటించారు. సోమవారం ఉదయం రాజంపేటలోని కళాంజలి కల్యాణ మండపంలో న్యాయవాది కొండూరు శరత్‌కుమార్‌రాజు అధ్యక్షతన నిర్వహించిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు రాజంపేటకు తీవ్ర అన్యాయం చేసిన వైసీపీని గద్దె దించుతామని, సుగవాసి బాలసుబ్రమణ్యంను 50వేల మెజారిటీతో, ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డిని 3 లక్షల భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రతినబూనారు., కార్యక్రమంలో తొలుత శరత్‌కుమార్‌రాజు మాట్లాడుతూ వైసీపీ నేతలు రాజంపేటకు తీవ్ర అన్యాయం చేయడమే తాను టీడీపీలోకి చేరడానికి ప్రధాన కారణమన్నారు. ప్రతి ఒక్కరూ వైసీపీని ఓడించడానికి ముందుకురావాలన్న ఉద్దేశ్యంతో ఈ ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి కుమారుడు నిఖిలేష్‌రెడ్డి, రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, నియోజకవర్గ టీడీపీ నాయకులు పోలి సుబ్బారెడ్డి, జనసేన పార్టీ పార్లమెంటు నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు, ఆర్టీసీ రీజియన్ మాజీ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు, బీజేపీ పార్లమెంటు అధ్యక్షులు సాయిలోకేష్, రాష్ట్ర బీజేపీ కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, బీజేపీ నంద్యాల పార్లమెంటు ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి చెన్నూరు సుధాకర్, న్యాయవాది సింగంశెట్టి రవీంద్ర, జిల్లా టీడీపీ మాజీ మహిళాధ్యక్షురాలు పత్తిపాటి కుసుమకుమారి, డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపల్ నెట్టెం శ్రీరాములునాయుడు, జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షులు మాలేపాటి రామకృష్ణంనాయుడు, మైనారిటీ నాయకులు గుల్జార్‌బాషా, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్.వి.రమణ, కౌన్సిలర్ పసుపులేటి సుధాకర్, జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ రామకోటి, రాజంపేట బీసీ నాయకులు మనుబోలు వెంకటసుబ్బయ్య మండల మాజీ ఉపాధ్యక్షుడు నాగ సుధాకర్ రెడ్డి, సీనియర్ టీడీపీ నాయకులు కూచివారిపల్లె వెంకటయ్యనాయుడు, బీసీనాయకులు ఇడిమడకల కుమార్, సీనియర్ టీడీపీ నాయకులు చేజర్ల సుబ్రమణ్యంరాజు, బీజేపీ నాయకులు సుమంత్‌రెడ్డి తదితరులు ప్రసంగిస్తూ అవినీతికి, దౌర్జన్యాలకు, అక్రమాలకు పాల్పడుతూ దోపిడీ చేసిన వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించి తీరుతామన్నారు.

రాజంపేటను జిల్లా కేంద్రం చేయిస్తా.. సుగవాసి

ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలన్న స్థానికుల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తానన్నారు. మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయిస్తానని, అన్నమయ్య డ్యాంను పునరుద్ధరిస్తానన్నారు. వైసీపీ నాయకుల ఇసుక లారీలను కొట్టుకుపోకూడదనే అన్నమయ్య డ్యాంను తెంపారని, దీంతో ఎందరోప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఇటువంటి దుర్మార్గులను, రాజంపేట అభివృద్ధి నిరోధకులను చిత్తుచిత్తుగా ఓడించి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.

మిథున్‌రెడ్డిని ఇంటికి పంపండి.. : నిఖిలేష్ రెడ్డి

రాజంపేట పార్లమెంటు అభివృద్ధినిరోధకుడైన ఎంపీ మిథున్‌రెడ్డిని చిత్తుచిత్తుగా ఓడించి ఇంటికి పంపాలని.. అదే సమయంలో తన తండ్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని పార్లమెంటుకు పంపి అభివృద్ధి ఫలాలు పొందాలని కిరణ్‌కుమార్‌రెడ్డి తనయుడు, యువనాయకుడు నిఖిలేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. మా తండ్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పీలేరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఒక మోడల్ అభివృద్ధి ప్రాంతంగా తీర్చిదిద్దారని, ఎంపీగా గెలిపిస్తే రాజంపేట పార్లమెంటును కూడా అదే రీతిలో అభివృద్ధి చేస్తారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను, ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తనయుడు నిఖిలేష్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుగవాసి బాలసుబ్రమణ్యం. చిత్రంలో జగన్‌మోహన్‌రాజు, సుబ్బారెడ్డి తదితరులు

కొండూరు రామరాజుకు ఘన నివాళి

గ్రంథాలయ మాజీ చైర్మన్, మాజీ మండలాధ్యక్షులు, దివంగత కొండూరు రామరాజుకు నేతలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన రాజంపేటకు చేసిన సేవలను కీర్తిస్తూ ఆయన అడుగుజాడల్లో నడిచి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

నియంత పాలనకు చరమగీతం

● రాబోయేది చంద్రబాబు పాలన ● టీడీపీ అభ్యర్థి బాలసుబ్రమణ్యం



కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

సుండుపల్లె, ఏప్రిల్ 22: ప్రజా కోర్టులో వైసీపీ నియంత పాలనకు సంకెళ్లు తప్పవని టీడీపీ రాజంపేట అసెంబ్లీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. సోమవారం పొలిమేరపల్లె గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక ప్రభుత్వం ఐదేళ్లు ప్రజలను పట్టి పీడించిందని.. ఇక రానున్నది చంద్రబాబు నాయుడు ప్రభుత్వమన్నారు. నోట్ల కట్టలతో రాజకీయం చేయాలని జగన్‌మోహన్‌రెడ్డి చూస్తున్నారని విమర్శించారు. ఐదేళ్ల అరాచకాలు చేస్తే.. 500 రూపాయలకు రాష్ట్ర ప్రజలు ఓటు వేయరు అనే విషయాన్ని వైసీపీ ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులు గుర్తించుకోవాలన్నారు. ప్రజలను డబ్బుతో కొనేందుకు సంతలో దొరికే కూరగాయలు కాదు అనే విషయాన్ని వైసీపీ గుర్తించుకోవాలని తీవ్రంగా విమర్శించారు. టీడీపీ కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేస్తున్నారని, అలాంటి వారందరికీ మంచి రోజులు వస్తాయన్నారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా సమస్యలు వెల్లువలా వస్తున్నాయని అలాంటి వారందరికీ న్యాయం చేసే బాధ్యత టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి తీసుకుంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించేందుకు ఓటర్లు సిద్ధం కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి కుమారుడు జ్ఞానేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్ నాయుడు, రాజకుమార్‌రాజు, రెడ్డిశేఖర్‌రాజు, చంద్రశేఖర్ రాజు, శ్రీనివాసులరెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి శివారెడ్డి, ఎల్‌వీ రమణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మంగిర రమణ, సుధాకర్‌రాజు, సుబ్బరామ్, సురేశ్, జనసేన మండల మహిళా నాయకురాలు రెడ్డిరాణి, రామాశ్రీనివాస్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్, జిల్లా నాయకులు వెంకట్రామరాజు, పెద్ద సంఖ్యలో టీడీపీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా వైసీపీ నేతల చేరికలు

సుండుపల్లె, ఏప్రిల్ 22: వైసీపీని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు పిలుపునిచ్చారు. సోమవారం పొలిమేరపల్లె గ్రామ పంచాయతీలో సర్పంచ్ పోలిరెడ్డి సుజాతమ్మ, టీడీపీ మండల నాయకులు శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో 200 కుటుంబాలు వైసీపీ నుండి టీడీపీలోకి చేరడం సంతోషదాయకమన్నారు. రాజంపేట పార్లమెంటు అభ్యర్థిగా మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సుగవాసి బాలసుబ్రమణ్యం పోటీ చేస్తున్నారని వారి అఖండ విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. టీడీపీలోకి వచ్చిన వారిని కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు రెడ్డెప్ప, మండల క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్‌నాయుడు, ప్రసాద్‌రాజు, శివారెడ్డి, శాంతకుమార్‌రెడ్డి, రెడ్డిశేఖర్‌రాజు, జనసేన మహిళా నాయకులు రెడ్డిరాణి తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కుటుంబాలతో ప్రసాద్‌బాబు

నందలూరు: గ్రామం అభివృద్ధి చెందాలంటే వైసీపీని వీడటం మంచిదంటూ మండలంలోని టంగుటూరు గ్రామ పంచాయతీకి చెందిన భువనబోయిన లక్ష్మీ నరసయ్య, మాజీ ఎంపీపీ ఆధ్వర్యంలో దాదాపు 200 కుటుంబాలు రాజంపేట తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, పోలి సుబ్బారెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి.

మాకినేనిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని దాదాపు 50 కుటుంబాల వారు కోనేటి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ కండువా కప్పుకున్నారు.



టీడీపీలో చేరిన టంగుటూరు నేతలు



టీడీపీ కండువా కప్పుకుంటున్న కొత్త మాధవరం నేతలు

ఒంటిమిట్ట : కొత్తమాధవరం గ్రామంలో సుగవాసి ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో పదుము పెద్ద ఎల్లయ్య యాదవ్, చిన్న యల్లయ్య కుటుంబం, మరో 10 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. నామాల వెంకటయ్య, నామాల వెంకటసుబ్బయ్య, ఆంజనేయరెడ్డి, ప్రవీణ్, ప్రసాద్, సాదు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

యల్లటూరు ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి ప్రచారం

నందలూరు, ఏప్రిల్ 22 : ఎన్‌డీఏ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజు, ఆర్టీసీ రీజియన్ మాజీ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు కోరారు. సోమవారం మండలంలోని బస్టాండు కూడలి నుంచి నందలూరు హరిజనవాడ వరకు జనసేన, బీజేపీ, టీడీపీ కూటమి బలపరిచిన రాజంపేట పార్లమెంటు అసెంబ్లీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి రాజంపేట పార్లమెంటు అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని సైకిల్ గుర్తుకు ఓటు వేసి రాజంపేట అసెంబ్లీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను అత్యధిక మెజారిటీతో గెలిపించి ఇప్పుడున్న ఈ రాక్షస ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు యల్లటూరు శివరామరాజు, జెడ్పీకో -ఆప్షన్ మాజీ సభ్యుబు షబ్బీర్ అహమ్మద్, బీజేపీ కో-కన్వీనర్ రాజంపేట అసెంబ్లీ డాక్టర్ అరిగె రాంప్రసాద్, నాగిరెడ్డిపల్లె మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, మాజీ ఎంపీపీ పల్లె సుబ్రమణ్యం, మైనారిటీ నాయకులు సయ్యద్ అమీర్, మున్వర్‌బాషా, మహబూబ్ బాషా, గంటా వాసుదేవయ్య, లక్ష్మీనరసయ్య, మోడపోతుల రాము, తోట శివశంకర్, ఉప్పుశెట్టి సుధీర్, జంగంశెట్టి సుబ్రమణ్యం, మట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న కూటమి నాయకులు

'జనసేన గెలుపు.. అభివృద్ధికి మలుపు'



ప్రచారంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

రైల్వేకోడూరు(రూరల్) ఏప్రిల్ 22: జనసేన గెలుపు రైల్వేకోడూరు అభివృద్ధికి మలుపు అని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి సతీమణి వరలక్ష్మి తెలిపారు. సోమవారం పట్టణంలోని బలిజ వీధిలో గంగమ్మకు పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ . రైల్వేకోడూరులో జనసేన జెండా ఎగరేసి చంద్రబాబుకు బహుమతిగా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కూటమి నాయకులు బీజేపీ ఇన్‌చార్జ్ గడ్డం చెంగల్ రాజు, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, టీడీపీ పట్టణ కన్వీనర్ పొకల మణి, మైనారిటీ నాయకులు పట్టాన్ మౌలా మహిళ నాయకురాలు నాగిరిపాడు మాజీ సర్పంచ్ కట్టా ఉమాదేవి, మైసూరివారిపల్లి సర్పంచ్ కారుమంచి సంయుక్త తదితరలు పాల్గొన్నారు.

'కోడూరుకు పూర్వ వైభవం తెస్తా..'

రైల్వేకోడూరు(రూరల్) ఏప్రిల్ 22: అరవ శ్రీధర్‌ను గెలిపించి కోడూరుకు పూర్వ వైభవం తెస్తానని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు తెలిపారు. సోమవారం పట్టణంలోని ఉంగరాల నగర్‌లో ఉమ్మడి కూటమి పార్టీ నాయకులతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన అభ్యర్థిని అఖండ మెజారిటీతో గెలిపించి కానుకగా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త విశ్వేశ్వర నాయుడు జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, ఓబులవారిపల్లె మాజీ జెడ్పీటీసీ రమణ, మైనారిటీ నాయకులు పట్టాన్ మౌలా, టీడీపీ పట్టణ కన్వీనర్ పోకల మణి, ఎస్సీ నాయకులు చిన్న పాల్గొన్నారు.

'టీడీపీ గెలుపునకు కృషి చేద్దాం'

రైల్వేకోడూరు(రూరల్) ఏప్రిల్ 22: చంద్రబాబు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించే వరకు కష్టపడదాం అని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ దళితులకు పిలుపునిచ్చారు. సోమవారం తనను కలవడానికి నియోజకవర్గం నుంచి వచ్చిన దళితులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు ఆదేశాల మేరకు ఉమ్మడి కూటమి జనసేన అభ్యరిని గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని దళిత నాయకులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో ప్రాజెక్టులకు పైసా ఇవ్వలేదు

● పింఛన్లు హౌసింగ్‌లో పెద్ద స్థాయిలో అవినీతి ● నామినేషన్ల ర్యాలీని విజయవంతం చేయాలి ● రాజంపేట ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి

సంబేపల్లె, ఏప్రిల్ 22: గత ఐదేళ్లలో సాగునీటి ప్రాజెక్టులకు వైసీపీ ప్రభుత్వం ఒక్క పైసా విడుదల చేయలేదని మాజీ ముఖ్యమంత్రి, రాజంపేట ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం నాగిరెడ్డిగారిపల్లె గ్రామం వట్టంవాండ్లపల్లెలో టీడీపీ నాయకులు గోపిరెడ్డి స్వగృహంలో కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల్లో స్పందన బాగా ఉందని వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత బాగా కనిపిస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి సంక్షేమం బదులు అవినీతి అరాచకమే కనిపిస్తోందన్నారు. రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలకు ఒక పక్కా భవనం కూడా నిర్మించలేదని, గత ప్రభుత్వంలో కట్టిన భవనాలను కార్యాలయాలుగా మార్చి గొప్పలు చెబుతున్నట్లు తెలిపారు. రైతులకు సాగునీరు లేదు, వెలగల నుంచి రాయచోటికి తాగునీరు అరకొర అందిందని, రానున్న రోజుల్లో తాగునీరు అందడం కష్టమే అన్నారు. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కూటమి అధికారంలోకి వస్తే సమస్యలన్నీ పరిష్కరించి అభివృద్ధి చేస్తామన్నారు. 24వ తేదీ జరిగే నామినేషన్ల ర్యాలీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు తెలియజేశారు. ఉదయం 11 నుంచి 12 వరకు నామినేషన్లు, ఆ తర్వాత 12.30 నుంచి 1.30 వరకు 2 కిలోమీటర్లు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం నాగిరెడ్డిగారిపల్లెకు చెందిన హేమత్‌కుమార్‌రెడ్డి సుమారు 50 కుటుంబాల సభ్యులతో టీడీపీ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లు నరసారెడ్డి, అర్చన విద్యాసంస్థల అధినేత మదన్‌మోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు గోపీనాథ్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, టీడీపీ మండలశాఖ అధ్యక్షులు చిన్నరెడ్డెయ్యయాదవ్, టీడీపీ ప్రచార కార్యదర్శి సుబ్బరాజుయాదవ్, నూరెకరాల రంగారెడ్డి, ఖాదర్‌బాషా, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

రాయచోటిటౌన్: పట్టణంలోని మదనపల్లె రోడ్డులో గల అజయ్ రెసిడెన్సిల్‌లో నాయకులకు, కార్యకర్తలతో కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తన నామినేషన్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని సూచించారు.

రామాపురం: మండలంలోని కర్ణపువాండ్లపల్లె, పాత రామాపురం, హరిజన వాడ, కొత్తపల్లె, బీసీ కాలనీ, నల్లగుట్టపల్లె కస్పాలో టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

రాష్ట్రంలోని బలిజలంతా ఏకం కావాలి

● రాష్ట్ర కాపు నేత దాసరి రాము

రైల్వేకోడూరు(రూరల్) ఏప్రిల్ 22: బలిజలంతా ఏకమై ఉమ్మడి కూటమి జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర కాపు నేత దాసరి రాము కాపులకు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో అరవ శ్రీధర్ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన మీద నమ్మకంతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ కోడూరు నియోజకవర్గంలో జనసేన అభ్యర్థిని ఎంపిక చేశారని అతని గెలిపించే బాధ్యత మనందరిదీ అని తెలిపారు. ఇక్కడ ఉత్సాహం చూస్తుంటే జనసేన గెలిచే మొదటి స్థానం కోడూరు అని ఆశాభావం వ్యక్తం చేశారు. అరవ శ్రీధర్‌ను గెలిపించి జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు బహుమతిగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం మండలంలోని కాపు నాయకులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండలంలో కాపు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి : చిట్వేలిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఎన్నికల సమన్వయంపై జనసేన నాయకులకు దాసరి రాము అవగాహన కల్పించారు. మండల జనసేన నాయకులు మాదాసు నరసింహ, సుభాష్ చంద్రబోస్, కొనిశెట్టి సుబ్బరాయుడు, తుపాకుల పెంచలయ్య, ప్రకాష్, మౌలానా, పగడాల మణి, మాదాసు శివ, ఆనందుల తేజ మన్మధ, లోకేష్ పాల్గొన్నారు.

రాజంపేట టౌన్ : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన గురుతర బాధ్యత బలిజ, తెలగ, కాపు సోదరులపై ఉందని రాష్ట్ర బలిజ, కాపు, తెలగ జేఏసీ చైర్మన్ దాసరి రాము అన్నారు. సోమవారం సాయంత్రం రాజంపేటలోని గీతాంజలి కళాశాలలో బలిజ సేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సంభావు వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన బలిజ ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జనసేన పార్టీ నాయకులు వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఎద్దల విజయసాగర్, మాజీ సర్పంచ్ తోట రామయ్య, భాస్కరపంతులు, చలపతి, సుధాకర్, అదృష్టదీపుడు, ఈశ్వరయ్య, వెంకటయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కాపు నాయకులు

బలిజలకు రిజర్వేషన్ ఎన్‌డీఏతోనే సాధ్యం

లక్కిరెడ్డిపల్లె ఏప్రిల్ 21: ఎన్‌డీఏ ప్రభుత్వంతో బలిజలకు 5 శాతం రిజర్వేషన్ సాధ్యమవుతుందని నవ్యాంధ్ర కాపు సంఘం అధ్యక్షుడు భాస్కర్ ప్రధాన కార్యదర్శి యనమల విశ్వనాథ తెలిపారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లెలో విలేకర్లతో మాట్లాడుతూ రాయచోటి అసెంబ్లీ అభ్యర్థి రాంప్రసాదురెడ్డి, బీజేపీ పార్లమెంటు అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించుకుంటామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కాపు, బలిజ, ఒంటరి తెలగ కులాలు తెలుగుదేశం పార్టీకి అధికారంలోకి రావడానికి కృషి చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కావలి ఆంజనేయులు, గంటా వెంకటసుబ్బయ్య, వేణు, చిన్నకొండు భాస్కర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

10లో శ్రీసాయి విద్యాలయ ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీసాయి పాఠశాల కరస్పాండెంటు డాక్టర్ బాలరాజు, ప్రిన్సిపాల్ రేణుకాదేవి

రాజంపేట, ఏప్రిల్ 22: 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో రాజంపేట శ్రీసాయి విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రేణుకాదేవి తెలిపారు. తమ పాఠశాల నుంచి సి.దేవాన్షి 596/600, ఎం.వైష్ణవి, వేణిక రెడ్డి 593/600 మార్కులు, పి.చైతన్య 592/600, ఎం.వెంకటసాయి రోహిత్ 590/600 మార్కులు సాధించారన్నారు. తమ పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించిందని ఆమె తెలియజేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థు లను పాఠశాల కరస్పాండెంటు డాక్టర్ ఎస్.బాలరాజు, పాఠశాల యాజమాన్యం అభినందించారు.

అక్షర స్కూల్ విద్యార్థుల విజయఢంకా



జి.నవ్యశ్రీ



ఎ.భారతి



ఎస్.సఫియా

రాజంపేట, ఏప్రిల్ 22 : 2024 ఎస్ఎస్‌సి ఫలితాల్లో అక్షర స్కూల్ విద్యార్థులు అత్యున్నత ఫలితాలు సాధించి విజయఢంకా మోగించారని పాఠశాల కరస్పాండెంటు మద్దిపట్ల విజయ చాముండేశ్వరి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం వెలువడిన ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారని, వారిలో ఎస్.సఫియా, ఎ.భారతి, జి.నవ్యశ్రీలు 591/600 మార్కులు సాధించారన్నారు.

రీజెన్సీ నలంద విద్యార్థుల ప్రతిభ



అవినాశ్



రాజేశ్



సుదీప్తి

రాజంపేట, ఏప్రిల్ 11: రీజెన్సీ నలందా విద్యార్థులు ఆకేపాటి అవినాష్ కుమార్ రెడ్డి 581/600, ఆవుల రాజేష్ 578/600, తిప్పరాజు సుదీప్తి 575/600, అత్తిగారి నంద కిషోర్‌రెడ్డి 571/600, వై.కావ్యశ్రీ 570/600 మార్కులు సాధించినట్లు రీజెన్సీ పాఠశాల సీఏవో గుడారు విజయ్‌చందు, ప్రధానోపాధ్యాయురాలు ఎల్. స్వాతి తెలియజేశారు.

వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించండి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కొండయ్య

లక్కిరెడ్డిపల్లె ఏప్రిల్ 21: వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నమయ్య జిల్లా డీఎంహెచ్‌ఓ కొండయ్య సూచించారు. సోమవారం కోనంపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో మాటా ్లడుతూ సిబ్బంది ఎల్లప్పు డూ గ్రామీణులకు అందుబాటులో ఉండాలన్నారు. వేసవి తీవ్రత కారణం కూలి పనులు చేసుకునేవారికి వడదెబ్బ తగిలే అవకాశాలు ఉన్నాయని, వారందరికి ఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఏఎన్ఎంలు గ్రామాల్లో అందుబాటులో రోగులకు సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిద్దయ్య, రిజ్వాన్ బేగ్, సీహెచ్‌ఓ రవీంద్ర, సూపర్‌వైజరు సరస్వతి, సతీష్, ఫార్మసిస్టు రెడ్డిపూర్ణిమా, ఏఎన్ఎంలు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాలు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 22: సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలో సోమవారం వేడుకలు నిర్వహించి పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అన్నమయ్య జిల్లా నాయకుడు మావులారి విశ్వనాథ్ మాట్లాడుతూ 1974లో పీడిత ప్రజలు, కష్టజీవుల కోసం ఏర్పాటైన పార్టీ సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ అన్నారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించిందన్నారు. నేటికి కూడా జార్ఖండ్‌లో లిబరేషన్ పార్టీకి చెందిన శాసనసభ్యులు ఉన్నారన్నారు. బీహార్‌లో ప్రస్తుతం 12 మంది ఎంఎల్‌ఏలు అధికారంలో ఉన్నారన్నారు. ఇండియా కూటమిలో కూడా సీపీఐ (ఎంఎల్) పార్టీ ఉందన్నారు. రమణ, సుజాత, వెంకటసుబ్బమ్మ, పెద్దప్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్వనాథ్

నేడే అసర్ల గంగమ్మ తిరుణాల

గాలివీడు, ఏప్రిల్ 22: ఏటిగడ్డ అసర్ల గంగమ్మ తిరుణాల మంగళవారం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాలివీడు మండల కేంద్రంలోని కుషావతి నదీ తీరాన వెలసిన అసర్ల గంగమ్మ జాతర సందర్భంగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం సిద్దలకూడు నైవేద్యంతో ప్రారంభమయ్యే జాతర రాత్రికి నిండు తిరుణాలగా మారుతుందన్నారు. భక్తులుచాందినీ బండ్లను అలంకరించి గ్రామోత్సవం నిర్వహి స్తారు. బుధవారం ఉదయం మహిళలు బోనాలు సమర్పిస్తారు.

కన్నుల పండువగా సీతారాముల కల్యాణం

సంబేపల్లె, ఏప్రిల్ 22: మండలంలోని సంబేపల్లె గ్రామం మాధంవాండ్లపల్లెలో సోమవారరా సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది టీడీపీ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నాగిరెడ్డి, దంపతులు పాల్గొన్నారు. . అనంతరం అన్నదానం చేశారు. గ్రామ ప్రజలు స్వామి వారి కల్యాణ మహోత్సవంలో పాల్గొని విజయవంతం చేశారు. రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.



2019 ఎన్నికల నాటికి
జిల్లా ఓటర్లు: 14,43,042
2024 నాటికి ఓటర్ల సంఖ్య: 15,54,712
ఈ ఐదేళ్లలో పెరిగిన ఓటర్లు: 111,670



కండువా గోలేంట్రా బాబు




నూర్‌బాషాకు కండువా కప్పుతున్న వైసీపీ నేతలు

గ్రామాల్లో కాస్త పలుకుబడి ఉన్న టీడీపీ నేతలు కనిపిస్తే చాలు.. వైసీపీ కండువా వేసేస్తున్నారు. ఇలా రామకుప్పానికి చెందిన నూర్‌బాషాకు రెండు సార్లు కండువా కప్పారు. అలాగే, ఇందిరానగర్‌కు చెందిన ఓ వ్యక్తి మసీదులో ప్రార్థన ముగించుకుని ఇంటికి వస్తుండగా వైసీపీ నేతలు అటుగా ప్రచారం చేస్తూ వచ్చారు. వెంటనే నేతలు ఆ 65 ఏళ్ల వ్యక్తికి తమ పార్టీ కండువా కప్పేశారు. ఆ ఫొటోలను వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేశారు. ఇలాంటి అనుభవం చాలామందికి ఎదురవుతోంది. 'మా కుటుంబమంతా టీడీపీనే. ఈ ఫొటోలు చూసి ఇంట్లోవాళ్లు ఇదేంటని అడుగుతున్నారు. బలవంతంగా కండువా వేశారని చెప్పుకోవాల్సి వస్తోంది' అంటూ పలువురు పేర్కొంటున్నారు. ఈ కండువాల గోలేంట్రా బాబూ అంటూ వీరంతా తలలు పట్టుకుంటున్నారు.

- రామకుప్పం

పోలింగ్ బూత్ @1400 ఓట్లు


● మీకు తెలుసా?



ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండేది గరిష్ఠంగా 1400 మంది ఓటర్లే. ఎందుకంటే.. ప్రతి కేంద్రంలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌లు ఈ మూడు ఒకదానికొకటి అనుసంధానంగా పని చేస్తాయి, ప్రస్తుతం వినియోగిస్తున్న ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్‌మిషన్)లకు అనుసంధానంగా ఉండే వీవీప్యాట్ (ఓటర్ వెరిఫైవబుల్ పేపర్ అండ్ ట్రయల్)లో కాగితాన్ని పొందుపరుస్తారు. అది 1450 స్లిప్పులను మాత్రమే ముద్రిస్తుంది. బ్యాటరీతో పనిచేసే వీవీప్యాట్‌లోని డిస్‌ప్లేలో ఓటు ఎవరికి వేశామన్నది కనిపిస్తుంది. అందులో 50 వరకు కాగితం, స్లిప్పులు, ఓటింగ్‌రోజు మాక్‌పోలింగ్ ప్రక్రియకు వాడతారు. ఇదిపోను 1400 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా చూస్తారు.

- చిత్తూరు కలెక్టరేట్

సిరా చుక్క కత



ఎన్నికల్లో ఓటు వేశాక పోలింగ్ కేంద్రంలో ఓటరు చూపుడు వేలిపై సిరా చుక్క గుర్తుగా పెడుతుంటారు. దీంతో సదరు ఓటరు మరో ఓటు వేయడానికి వీలుండదు. దొంగ ఓట్ల కట్టడికి ఎన్నికల కమిషన్ ఎప్పుడో రూపొందించిన నిబంధన ఇది. ఈ సిరాగుర్తు 72 గంటల పాటు చెరిగిపోదు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా సాధ్యం కాదు. మైసూరుకు చెందిన మైసూరు పెయింట్స్ అండ్ వార్నిష్ అనే పరిశ్రమ ఈ ఇంకును తయారు చేస్తోంది. 1962 నుంచి దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ఈ సిరానే ఎన్నికల కమిషన్ ఉపయోగిస్తోంది. ఈ సిరాలో 7.25 శాతం సిల్వర్, నైట్రేట్ కలపడం వల్ల అంత తొందరగా చెరిగిపోదని నిపుణులు చెబుతారు.

- చిత్తూరు కలెక్టరేట్

వేపంజేరి ● ముగిసిన చాప్టర్

మారుమూల గ్రామమైన వేపంజేరి కేంద్రంగా 1955లో నియోజకవర్గం ఏర్పాటైంది. ఇందులో గంగాధరనెల్లూరు, గుడిపాల, పెనుమూరు, పూతలపట్టు మండలాలతోపాటు చిత్తూరు మండలంలోని కొన్ని పంచాయతీలుండేవి. 1967 వరకు జనరల్.. తర్వాత రిజర్వు నియోజకవర్గంగా మారింది. 1955లో ఎస్సీ చెంగల్రాయనాయుడు (స్వతంత్ర), 1962లో జి.ఎస్.పట్టాభిరెడ్డి (స్వతంత్ర), 1967, 1972లో మునస్వామప్ప (కాంగ్రెస్), 1978లో బంగ్లా ఆర్ముగం (జనతా), 1983లో తలారి రుద్రయ్య (టీడీపీ), 1985, 1989లో గుమ్మడి కుతూహలమ్మ (కాంగ్రెస్), 1994లో ఆర్.గాంధీ (టీడీపీ), 1999, 2004లో కుతూహలమ్మ (కాంగ్రెస్) గెలుపొందారు. ఈమె మంత్రిగా, డిప్యూటీ స్పీకరుగా పనిచేశారు. 2009 నాటి నియోజకవర్గాల పునర్విభజనతో.. ఈ నియోజకవర్గంలోని గంగాధరనెల్లూరు, పెనుమూరు మండలాలు గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో.. పూతలపట్టు మండలం పూతలపట్టు నియోజకవర్గంలో కలిసింది. వేపంజరి అసెంబ్లీ సెగ్మెంటు హోదా కోల్పోయింది.

- గంగాధరనెల్లూరు

జగన్నాటకం!

నవ్వులపాలైన హంద్రీ-నీవా నీటి విడుదల డ్రామా



సీన్ 1

ఎక్కడ: రామకుప్పం మండలం రాజుపేట
ఎప్పుడు: ఈ ఏడాది ఫిబ్రవరి 26వ తేది
కార్యక్రమం: హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కాలువకు కృష్ణా జలాలు విడుదల ప్రారంభోత్సవం
ప్రారంభోత్సకులు: ముఖ్యమంత్రి జగన్



సీన్ 2

ఎక్కడ: రాజుపేట వద్ద హంద్రీ-నీవా కాలువకు నీటి విడుదల ప్రదేశం
ఎప్పుడు: ఫిబ్రవరి 27
కార్యక్రమం: సీఎం నీళ్లు విడుదల ప్రారంభోత్సవం చేయడానికి పెట్టిన గేటు తొలగింపు
నిర్వాహకులు: హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు



సీన్ కట్ చేస్తే..

వారం రోజుల తర్వాత: నీళ్లు పారకనే ఎండిపోయిన హంద్రీ-నీవా కాలువ
ప్రత్యక్ష సాక్షులు: కుప్పం నియోజకవర్గ ప్రజలు
బట్టబయలు చేసింది : ప్రతిపక్షాలు, ప్రింట్ అండ్ ఎలక్రానిక్ మీడియా.



అవును.. ఎన్నికల్లో లబ్ధికోసం ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి 26వ తేదీన కుప్పం దాకా శ్రమించి హెలికాప్టర్‌లో వచ్చి మరీ రామకుప్పం మండలం రాజుపేట వద్ద ఆడిన హంద్రీ-నీవా కాలువకు కృష్ణా జలాలు విడుదల ప్రహసనం డ్రామా అని, తర్వాత రెండు మూడు రోజులకే తేలిపోయింది. వారం తర్వాత చూస్తే కాలువలో అసలు నీటిని వదిలిన జాడలే కనిపించలేదు. రామకుప్పం మండలంలో మూడు చెరువులకు నీటిని వదలామన్నారు కానీ, అవిప్పుడు ఎండిపోయి బోరుమంటున్నాయి. కుప్పం నియోజకవర్గ పరిధిలో కాలువ పొడవు 139 కిలోమీటర్లు, నింపాల్సిన చెరువులు 54. గమ్యస్థానం కుప్పం మండలంలోని పరమసముద్రం చెరువు. ప్రస్తుతం కాలువలో చుక్క నీరు లేని దుస్థితి.

నాటకమాడింది ఇలా

ఫిబ్రవరి 26వ తేదీన సీఎం జగన్ కుప్పం పర్యటనకు శాంతిపురం మండలం పరిధిలో బహిరంగ సభను నిర్వహించడమే కాక, హంద్రీ-నీవా కాలువ ప్రారంభోత్సవం పేరుతో నాటకానికి తెరలేపారు. పుంగనూరు రిజర్వాయర్‌నుంచి వి.కోటకు తీసుకొచ్చిన నీటిని అక్కడినుంచి నిరంతరాయంగా పంప్ చేయించి, నిల్వ ఉంచి ప్రారంభోత్సవం రోజున గేటును తెరచి ప్రారంభోత్సవం చేసినట్లు కలరింగ్ ఇచ్చారు. నీటి విడుదల పేరుతో జగన్ పైకెత్తిన ఇనుప గేటును మరుసటి రోజునే అధికారులు తరలించుకు వెళ్లి, విమర్శలు రావడంతో తిరిగి ఏర్పాటు చేయడం ఇది నాటకమనడానికి ప్రత్యక్ష నిదర్శనం. ఆ తర్వాత టీడీపీ శ్రేణులే కాదు, పలువురు సామాన్యులు కూడా ఎండిపోయిన కాలువలోకి వెళ్లి, వీడియోలు చేసి, ఫొటోలు దిగి, ధర్నాలు చేసి జగన్నాటకాన్ని ఎండగట్టారు. మొదట్లో ఏవో కుంటిసాకులతో వివరణలు ఇవ్వబోయిన రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు, స్థానిక హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు తర్వాత కిమ్మనకుండా ఉండిపోయారు. వైసీపీ నేతలైతే కొన్నిరోజులు ప్రతి విమర్శలు చేసి, తర్వాత పూర్తిగా ఎండిపోయిన కాలువ కళ్లముందు కనిపిస్తుండడంతో ఏమనలేక కిక్కురుమనడం లేదు.

- కుప్పం

పుంగనూరు అరాచకాలకు కేరాఫ్‌గా మారింది. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వచ్చాక రాజకీయ ప్రత్యర్థులపై దౌర్జన్యాలు, దాడులు, పోలీసు కేసులు ఎక్కువయ్యాయి. భూ తగాదాలతో సామాన్యులూ ఇబ్బంది పడుతున్నారు. వీటినే ఈ ఎన్నికల్లో ఆయన ప్రత్యర్థులు రాజకీయ ప్రచారాస్త్రాలు వాడుకుంటున్నారు. కూటమి పార్టీల సహకారంతో గెలుపొందేందుకు టీడీపీ సర్వశక్తులూ ఒడ్డుతోంది.

- పుంగనూరు



పెద్దిరెడ్డి అరాచకాలే ప్రత్యర్థుల ప్రచారాస్త్రాలు

● ప్రశాంత పుంగనూరే వీరి ఎన్నికల నినాదం
● ఎంపీగా కిరణ్ పోటీతో బలపడుతున్న టీడీపీ

రాష్ట్రంలోని కీలక నియోజకవర్గాల్లో పుంగనూరు ఒకటి. ఈ ఎన్నికల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి(వైసీపీ), చల్లా రామచంద్రారెడ్డి(టీడీపీ), రామచంద్రయాదవ్ (బీసీవై) తలపడుతున్నారు. 2009 వరకూ పుంగనూరు టీడీపీ కంచుకోట. టీడీపీకి పెద్దదిక్కుగా ఉన్న మాజీ ఎంపీ రామకృష్ణారెడ్డి కన్నుమూయడం, వీరి సొంత మండలం పెద్దపంజాణి పలమనేరులో కలవడంతో అమరనాథరెడ్డి అక్కడికి వెళ్లారు. పీలేరు నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు రావడం.. టీడీపీలో క్రియాశీలకంగా ఉన్న నేతలు, పార్టీ శ్రేణులను బలవంతంగా తనవైపు తిప్పుకొన్నారు. దీంతో 2009 ఎన్నికల నాటికి చాలా బలహీనంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. అనంతరం 2014, 2019 ఎన్నికల్లోనూ గెలుపొందిన ఆయన.. రెండు పర్యాయాలు మంత్రి కావడంతో ప్రత్యర్థులను రాజకీయంగా అణగతొక్కారు. చాలామందిని నయాన భయాన తనవైపు తిప్పుకొన్నారు. మిగిలిన వారిపై దౌర్జన్యాలు, అరాచకాలు, పోలీసు కేసులతో వేధింపులు ఎక్కువయ్యాయి. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఇక్కడ దాదాపు వెయ్యి మందిపై కేసులు నమోదు చేయించారు. మందలాది మందిని జైలుకు పంపారు. మరోవైపు టీడీపీ తరఫున 2009, 2014లో వెంకటరమణరాజు.. 2019లో అనీషారెడ్డి పోటీ చేయగా.. ఈ ఎన్నికల్లో చల్లా రామచంద్రారెడ్డి బరిలో నిలిచారు. పెద్దిరెడ్డి సారథ్యంలో వైసీపీ శ్రేణులు పాల్పడిన అరాచకాలను ఈయన ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. వీటికి ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తోంది. జనసేన, బీజేపీ జత కట్టడంతో టీడీపీ శ్రేణులకు మరింత ఉత్సాహాన్నిచ్చాయి. సూపర్ సిక్స్ పథకాలను జనంలోకి తీసుకెళ్లున్నారు. చల్లాబాబు గ్రామాల్లో తిరుగుతూ పలుచోట్ల వైసీపీ నేతలు, శ్రేణులను టీడీపీలో చేర్చుకుంటున్నారు.

ప్రజలను చైతన్యపరుస్తూ..

మంత్రి కుటుంబ కంపెనీ నిర్మిస్తున్న ప్రాజెక్టుల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించలేదని, ఎన్జీటీ రూ.100కోట్లు జరిమానా విధించడం, ఇసుక, మట్టి తరలింపు, కొండలు, గుట్టలు కరిగిపోవడం, ప్రాజెక్టు నిర్వాసిత రైతులకు పరిహారం ఇవ్వకపోవడం, అక్రమకేసులు, దౌర్జన్యాలను ప్రత్యర్థులు ప్రచారాస్త్రాలుగా ఉపయోగిస్తున్నారు. ప్రశాంత పుంగనూరు, రౌడీయిజం అణచివేత నినాదాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. మంత్రికి చెందిన శివశక్తి డెయిరీ, పీఎల్ఆర్ ఫుడ్స్ పండ్ల పరిశ్రమల ద్వారా రైతులకు గిట్టుబాటు ధరల్లేక తీవ్రంగా నష్టపోతున్నారనే అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళుతున్నారు.

చల్లా బాబుపై వైసీపీ దాడులు

గతేడాది సోమల మండలం పెద్దఉప్పరపల్లెలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన చల్లా రామచంద్రారెడ్డిపై వైసీపీ శ్రేణులు రెండుచోట్ల దాడులకు పాల్పడి కార్లు ధ్వంసం చేశారు. గతేడాది ఆగస్టు 4న పుంగనూరు మీదుగా చంద్రబాబునాయుడు చిత్తూరు వెళుతున్న సందర్భంగా టీడీపీ శ్రేణులపై పోలీసుల లాఠీచార్జి వల్ల జరిగిన గొడవల్లో చల్లా బాబుతో పాటు 498మంది నాయకులు, కార్యకర్తలపై హత్యాయత్నం తదితర కఠినమైన సెక్షన్లతో కేసులు పెట్టి అరెస్ట్ చేశారు. పెద్దిరెడ్డికి వ్యతిరేకంగా వ్యవహరించిన 1000మందిపై పోలీసు కేసులు ఉండగా పలువురిపై రౌడీషీట్లు కూడా తెరిచారు. వీటన్నింటినీ ప్రచారాల్లో ప్రస్తావిస్తున్నారు.

బీసీవై నేత పోరాటం

పుంగనూరు బరిలో ఉన్న బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ పెద్దిరెడ్డి ఆగడాలపై బలంగా బాణాలను సంధిస్తున్నారు. తనపై జరిగిన హత్యాయత్నం, దౌర్జన్య దమనకాండను ఈ బీసీ నేత కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు నివేదించి వైప్లస్ కేంద్ర భద్రత పొందారు. పెద్దిరెడ్డిని లక్ష్యంగా పోరాడుతున్న తనపై 45కేసులు పెట్టించిన తీరును, నియోజకవర్గంలో అరాచకాలపై గళం విప్పుతున్నారు. పాడి, పండ్ల రైతులను మంత్రి దోపిడీ చేస్తున్నారని ప్రజలకు వివరిస్తున్నారు.

కిరణ్ పోటీతో కొత్త ఉత్సాహం


పెద్దిరెడ్డి దీర్ఘకాల ప్రత్యర్థి, మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తుండటం పుంగనూరులో టీడీపీకి కలసివస్తోంది. ఇది టీడీపీ శ్రేణులకు ధైర్యాన్నిస్తోంది. పుంగనూరు అభివృద్ధి మ్యానిఫెస్టోతో కూటమి నేతలు ముందుకు వెళుతున్నారు.

అన్నీ మంత్రికేనా?

నియోజకవర్గంలో చిన్న పని నుంచి పెద్ద కాంట్రాక్టు పనుల వరకు మంత్రి కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ కంపెనీ చేస్తోంది. దీంతో వైసీపీలోని కాంట్రాక్టర్లకు పనులు లేకుండా పోయాయి. వీరంతా అసంతృప్తితో ఉన్నారు. కొందరికి మాత్రం భవన నిర్మాణ కాంట్రాక్టులు దక్కాయి.

హ్యాట్రిక్ కొట్టింది ఒక్కరే

● పలమనేరు చరిత్ర



తొలినాళ్లలో పంచాయతీగా ఉన్న పలమనేరు అంచెలంచెలుగా ఎదిగింది. 2004లో మున్సిపాలిటీగానూ, దశాబ్దం క్రితం పోలీసు సబ్‌డివిజన్‌గా, మూడేళ్ల కిందట రెవెన్యూ డివిజినల్ కేంద్రంగా రూపుదిద్దుకుంది. 1978 నుంచి ఈ నియోజకవర్గాన్ని 31 సంవత్సరాలు ఎస్సీలకు రిజర్వు చేశారు. ఇక్కడ నుంచి మూడుసార్లు టీడీపీ పక్షాన ఎన్నికైన డాక్టర్ పట్నం సుబ్బయ్య ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడుల క్యాబినెట్‌లో పనిచేశారు. 2014లో వైసీపీ అభ్యర్థిగా గెలిచి రెండేళ్ల తరువాత టీడీపీ లో చేరిన అమరనాథరెడ్డి పరిశ్రమల శాఖ మంత్రిగా ప్రాతినిధ్యం వహించారు.

నియోజకవర్గం ఏర్పడిన సంవత్సరం: 1951
ఇప్పటిదాకా జరిగిన ఎన్నికలు: 15

వీరే ఎమ్మెల్యేలు

1952- రామబ్రహ్మం, (కాంగ్రెస్)
1955- ఎ. రత్నం, (కాంగ్రెస్)
1962 - కుసిని నంజప్ప(కాంగ్రెస్)
1967- టి.సి. రాజన్ (స్వతంత్ర పార్టీ)
1972- ఎం.ఎం. రత్నం(కాంగ్రెస్)
1978- ఎ రత్నం(కాంగ్రెస్)
1983- ఈ.ఆంజినేయులు (టీడీపీ)
1985,1989,1994- డాక్టర్ పట్నం సుబ్బయ్య (టీడీపీ)
1999- డాక్టర్ ఎం. తిప్పేస్వామి (కాంగ్రెస్)
2004- లలితకుమారి (టీడీపీ),
2009- అమరనాథరెడ్డి (వైసీపీ),
2014 - అమరనాథరెడ్డి (టీడీపీ),
2019- ఎం. వెంకటేగౌడ(కాంగ్రెస్)

మండలాలు : పలమనేరు, గంగవరం, వి.కోట,పెద్దపంజాణి,
మున్సిపాలిటీ : పలమనేరు

ఓటర్ల సంఖ్య: 2,66,739
పురుషులు: 1,32,020
స్త్రీలు: 1,34,719
ఇతరులు: 0

- పలమనేరు

టెన్త్ పరీక్షా ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 22: పదో తరగతి ఫలితాల్లో స్థానిక ప్రశాంత్ నగర్ శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు రాష్ట్రసాయిలో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ఆ స్కూల్ రీజనల్ ఇన్‌చార్జ్ శ్రీధర్ తెలిపారు. ఇందులో మదనపల్లెకు చెందిన జర్నలిస్టు జె.శ్రీనివాసులు కుమార్తె జె.శ్రావణి 600 మార్కులకుగాను 597మార్కులు, ఎస్ రుహినాజ్‌కు 600గాను 595, మహ్మద్ ఉల్ హసన్ 600గాను 594, జి. భవ్యశ్రీ 600గాను 592, ఆర్ పూర్ణేష్‌సాయి 600గాను 592, రసితారెడ్డి 600గాను 591, వీక్షిత 600గాను 591, ఎస్ జైబా షష్మీమ్ 600గాను 591,మార్కులు సాధించారన్నారు. 500పైగా 92 మంది విద్యార్థులు మార్కులు సాధించారన్నారు. ఘన విజయం సాధించిన విద్యార్థులను తిరుపతి ఏజీఎం సురేష్, రీజనల్ ఇన్‌చార్జ్ శ్రీధర్, మల్లికార్జున సర్కిల్ స్కూల్ ప్రిన్సిపాల్ విజయకుమారి, డీన్ భోగేశ్వర్, సీ.బ్యాచ్ ఇన్‌చార్జీ నూర్ మహ్మద్, ఎస్ బ్యాచ్ ఇన్‌చార్జ్ రహిమాబీ,డీన్ అనిల్, వెంటరేష్, విద్యార్థులను అభినందించారు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. మదనపల్లె విజయభారతీ హైస్కూల్‌లో కాసుల యాస్మిన్ 600 మార్కులుకు 594 కాజీ సయ్యద్ సనా 600గాను 579, ఆర్ హఫ్‌సా600 మార్కులకుగాను 579, పెద్దమేకల మెహతీరెడ్డి 600గాను 578 సాధించారని స్కూల్ కరస్పాండెంట్ సేతుతోపాటు ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

తంబళ్లపల్లెలో: పదోతరగతి పరీక్షా ఫలితాల్లో తంబళ్లపల్లె మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 333 మంది పరీక్ష రాయగా 240 మంది పాసై 72శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ త్యాగరాజు తెలిపారు. అంగళ్లు బీసీ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థి పి.కళ్యాణ్ 559 మార్కులు, కన్నెమడుగు ఉన్నత పాఠశాల విద్యార్థి ఎన్.ప్రశాంత్‌కుమార్ 555 మార్కులు, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి ఆర్.జ్యోషిత 553 మార్కులు సాధించినట్లు తెలిపారు. రేణుమాకులపల్లె ఉన్నత పాఠశాల, అంగళ్లు బీసీ వెల్ఫేర్ పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించాయని విద్యార్థులను ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, హెచ్‌ఎంలు అభినందించారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యం మండలంలో 10వ తరగతి విద్యార్థులు 92 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో మనోహర్ తెలిపారు. పెద్దమండ్యం 83.8 శాతం, మోడల్ స్కూల్ 93.4 శాతం, యల్లంవారిపల్లె 81.8, కలిచెర్ల తెలుగు 96 శాతం, కలిచెర్ల ఉర్దూ 93.3 శాతం, వెలిగల్లు 91.6 శాతం, కస్తూరిబా స్కూల్ 97.3శాతం సాధించినట్లు తెలిపారు. కాగా, కేజీబీవి విద్యార్థిని కల్పన 567 మార్కులు, కలిచెర్ల తెలుగు మీడియం హైస్కూల్ సల్మా 564, పెద్దమండ్యం హైస్కూల్ మల్లికార్జున 564 మార్కులు సాధించారన్నారు.

నిమ్మనపల్లిలో: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఫలిషాఅజ్మకి 600 మార్కులకు 579 సాధించగా, రెడ్డిశ్రీ 600మార్కులకు గాను577, జస్మిత600లకు 575మార్కులు సాదించినట్లు పాఠశాల హెచ్‌ఎం తెలిపారు. నిమ్మనపల్లి జడ్పీహైస్కూల్‌లో చదువుతున్న శ్రావ్యకు 600 మార్కులకు గానూ 568 వచ్చినట్లు ప్రధానోపాధ్యాయుడు అంజాద్ తెలిపారు. మండలానికి సంబంధించి 86శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో-2 నారాయణ తెలిపారు.

గుర్రంకొండలో:పది పరీక్షా ఫలితాల్లో గుర్రంకొండ మండలం చెర్లోపల్లె హైస్కూల్ విద్యార్థి ఎం.చేతన్‌కుమార్ 600 మార్కులకు 585 మార్కులు సాధించాడు. అలాగే గుర్రంకొండ తెలుగు హైస్కూల్ విద్యార్థినులు శ్రీలేఖ 569, అంజలి 563 మార్కులు సాధించినట్లు ఎంఈవో సురేంద్ర బాబు తెలిపారు. అలాగే గుర్రంకొండ బాలిక గురుకుల పాఠశాల వందశాతం ఉత్తీర్ణత సాధించిందన్నారు.



వాల్మీకిపురం మండలం గండబోయనపల్లెలో విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

వాల్మీకిపురంలో: పది పరీక్షా ఫలితాలలో చింతపర్తి జడ్పీ హైస్కూల్‌కు చెందిన పి.కీర్తన 579 మార్కులు, గండబోయనపల్లెకు చెందిన ఎస్.మిస్బాతస్లీం 576మార్కులు సాధించింది. మండలంలోని మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లో 495మంది విద్యార్థులకు గానూ 400 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో వెంకటరత్నం తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 81శాతం ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ఈసందర్భంగా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను అభినందించారు.

కురబలకోటలో: కురబలకోట జడ్పీ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారు. కురబలకోట హైస్కూల్‌కు చెందిన తబసుమ్ 600మార్కులకు గానూ 583, ముదివేడు మోడల్ స్కూల్‌కు చెందిన లోకనాథరెడ్డి. రామ్‌చరణ్ రెడ్డి 582, అంగళ్ళు జడ్పీ హైస్కూల్‌కు చెందిన రుచిత 572 మార్కులు సాధించారు. ఏపీ మోడల్ స్కూల్‌లో 102 మందికి గానూ 94 మంది, కేజీబీవీలో 33 మంది విద్యార్థులకు గానూ 33మంది, అంగళ్ళు జడ్పీ హైస్కూల్‌లో 117 మంది విద్యార్థులకు గానూ 101మంది, ముదివేడు జడ్పీ హైస్కూల్‌లో 72 మంది విద్యార్థులకు గానూ 55మంది, తెట్టు జడ్పీ హైస్కూల్‌లో 22 మంది విద్యార్థులకు గానూ 19మంది, కురబలకోట జడ్పీ హైస్కూల్‌లో 55మంది విద్యార్థులకు గానూ 44మంది ఉత్తీర్ణత సాధించారు. అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ఎంఈవో ద్వారకనాథ్ అభినందించారు.

కలకడలో:మండలంలో పది పరీక్షలో మొత్తం 10 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 424 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 412 మంది(97.17)శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో మునీంద్రనాయక్ తెలిపారు. ఇందులో కోన, కదిరాయచెరువు, ఎర్రయ్యగారిపల్లె, కలకడ కేజీవీబీ, ఆదర్శ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కాగా కలకడ బాలిక గురుకుల పాఠశాల మార్కులు పంట పండించినట్లు ప్రిన్సిపాల్ సుమిత్ర తెలిపారు. ఇందులో విద్యార్థిని లిఖిత 600 మార్కులకు గానూ 597 మార్కులు, విద్యార్థినిలు నేత్ర 578 మార్కులు, దీక్షిత 572 మార్కులు, పల్లవి 571 మార్కుల, డిష్మిత 500 మార్కులు పొందినట్లు పేర్కొన్నారు. పాఠశాల్లో మొత్తం 64 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 62 మంది ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. కోన హైస్కూల్ విద్యార్థిని నాజియా 573 మార్కులు సాధించినట్లు హెచ్‌ఎం చెంగల్‌రాయులు తెలిపారు.

పీలేరులో: పదో తరగతి పరీక్షల ఫలితాల్లో 91.60 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పీలేరు ఎంఈవో-1 లోకేశ్వర్ రెడ్డి తెలిపారు. పీలేరు మండలంలోని 15 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 4 గురుకుల పాఠశాలల్లో పరీక్షలకు 873 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 795 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని జె.భార్గవి 592 మార్కులు, కోటపల్లె జడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన షీమా ఖౌరీన్ 588 మార్కులు, పాత బస్టాండులోని జడ్పీ మెయిన్ పాఠశాలకు చెందిన ఖైరున్నిసా 584 మార్కులు సాధించారన్నారు. అదే విధంగా మండలంలోని 12 ప్రైవేటు విద్యాసంస్థల తరఫున 596 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 591 మంది(99.16 శాతం) ఉత్తీర్ణులయ్యారని లోకేశ్వర్ రెడ్డి తెలిపారు.

బి.కొత్తకోటలో: బి.కొత్తకోట ప్రభుత్వ పాఠశాల(బాలికలు) లో పదో తరగతి విద్యార్థి తమన్నా 600 గాను594 మార్కులు సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం తెలిపారు. గోళ్లపల్లి జడ్పీహైస్కూల్ విద్యార్థి పి.నరేంద్ర 567 మార్కులు, బి.కొత్తకోట బాలికల పాఠశాలకే చెందిన పి.దీప్తి 565 మార్కులు సాధించగా ఎంఈవో రెడ్డిశేఖర్ అభినందించారు.

పెద్దతిప్పసముద్రంలో : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు సత్తా చాటారు. మండలంలోని బూర్లపల్లె, కమ్మచెరువు, కందుకూరు, పీటీఎం(తెలుగు), పీటీఎం(ఉర్దూ), పులికల్లు, రంగసముద్రం, టి.సదుం, మోడల్ స్కూల్, కేజీబీవీలలో 308 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 229 మంది ఉత్తీర్ణులయ్యారు. కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి విష్ణువర్ధన్ 576 మార్కులు, పీటీఎం ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థిని భవశ్రీ 565 మార్కులు, తనుశ్రీ అనే విద్యార్థిని 565 మార్కులు సాధించారు. వారిని ఎంఈవోలు నారాయణ, గోస్‌పీర్‌లతో పాటు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమారి, ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు వారిని ప్రత్యేకంగా అభినందించారు.

రామసముద్రంలో: మండల కేంద్రంలోని ఏపీ ఆదర్శ పాఠశాల విద్యార్థినులు పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. పాఠశాల విద్యార్థినులు చందన 579 మార్కులు, గీత 563మార్కులు, లలిత 560 మార్కులు సాధించారు. ఈ పాఠశాలలో మొత్తం 89మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 87మంది ఉత్తీర్ణతతో 97శాతం ఫలితాలు సాధించారు. అలాగే చెంబకూరు జడ్పీ హైస్కూల్ 84శాతం, కేజీబీవీ పాఠశాలలో వందశాతం, మట్లవారిపల్లె జడ్పీ హైస్కూల్‌లో 89శాతం, కేసీపల్లె హైస్కూల్‌లో 81శాతం, అరికెల హైస్కూల్‌లో 94శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవోలు హేమలత, ఆంజనేయులు తెలిపారు. విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యాయులు అభినందించారు.

కలికిరిలో: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, సంస్థల్లో 78 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో కరీముల్లా తెలిపారు. మండల స్థాయిలో రాయలసీమ విద్యార్థి పవన్‌సాయి అత్యధికంగా 587 మార్కులు సాధించగా స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో హేమశ్రీ, సింధులు 579 వంతున, హనీషా 572, కావ్య, నవ్యశ్రీలు 571 వంతున, ముత్యాలు 566, శ్రావ్యశృతి 561 మార్కులు సాధించారు. కలికిరి బాలికోన్నత పాఠశాలలో 576, మహల్ తెలుగు పాఠశాలలో 549, మేడికుర్తి హైస్కూల్‌లో 536, కలికిరి ప్రభుత్వ హైస్కూల్‌లో 532, గడి ఉర్దూ హైస్కూల్లో 515 మార్కులు సాధించారు.

అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై నివేదికలు పంపండి



రిటర్నింగ్ అధికారితో చర్చిస్తున్న అబ్జర్వర్ రవీంద్రకుమార్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 22: రాజంపేట పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ప్రచారం, సమావేశాల సందర్భంగా చేస్తున్న ఖర్చులపై ప్రతి రోజు నివేదికలు పంపాలని ఎక్స్‌పెండేచర్ అబ్జర్వర్ రవీంద్రకుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎక్స్‌పెండేచర్ విభాగంలో ఆయన అధికారులకు పలు సూచనలిచ్చారు. ఎన్నికల సమావేశాలు, బహిరంగ సభలు, ప్రచారాలపై వీఎస్‌ఎస్ బృందం ఇచ్చే వీడియోల ఆధారంగా నిర్దేశించిన విలువలతో అభ్యర్థులు ఎంత ఖర్చు చేస్తున్నారో వివరాలు సిద్ధం చేయాలన్నారు. దీనిపై మే 4, 7, 11 తేదీల్లో మళ్లీ వచ్చి నివేదికలు పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్ పాల్గొన్నారు.

మదనపల్లెలో ఐదు నామినేషన్లు దాఖలు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 22: మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో నాలుగో రోజున ఐదు నామినేషన్లు దాఖలు అయ్యాయి. సోమవారం రిటర్నింగ్ అధికారి హరి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన నామినేషన్ ప్రక్రియలో వైసీపీ అభ్యర్థి నిస్సార్‌అహ్మద్, కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి మల్లెల పవన్ కుమార్ వేర్వేరుగా వెళ్లి నామినేషన్ వేశారు. వారితో పాటు స్వతంత్ర్య అభ్యర్థులుగా మదనపల్లె పట్టణానికి చెందిన మణి శంకర్, వి.ఉమాదేవి, మదనపల్లె మండలం కొత్తిండ్లు పంచాయతికి చెందిన నర సింహనాయక్ నామినేషన్లు దాఖలు చేశారు. డీఎస్పీ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో వన్‌టౌన్, టు టౌన్, తాలూకా సీఐలు వల్లీబషు, యువరాజు, శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె శాసనసభ నియోజక వర్గానికి సోమవారం ఐదు నామినేషన్లు దాఖలైనట్లు ఆర్వో రాఘవేంద్ర తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంఎన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇండిపెండెంట్, కాంగ్రెస్ అభ్యర్థిగా భానుచంద్రారెడ్డి ఒక్కొక్క సెట్టు ఇండిపెండెంట్ అభ్యర్థిగా జి.కృష్ణప్ప నామినేషన్ పత్రాలను తంబళ్లపల్లె రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆర్వో రాఘవేంద్రకు అందజేశారు. అదేవిధంగా వైసీపీ అభ్యర్థిగా పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మూడో సెట్ నామినేషన్ పత్రాలను ప్రతిపాదకుడు ఖలీల్ అహమ్మద్ ఆర్వోకు అందజేశారు.

పీలేరులో: పీలేరు అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరఫున బాలిరెడ్డి సోమశేఖర రెడ్డి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. పీలేరులోని ఆర్వో కార్యాలయంలో ఆయన తన నామినేషన్ పత్రాలను ఆర్వో ఫర్మాన్ అహ్మద్‌కు అందజేశారు. నామినేషన్ అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా రావాలన్నా, పోలవరం పూర్తి కావాలన్నా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు, కడప స్టీలు ప్లాంటు కల సాకారం కావాలన్నా కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రావాలన్నారు. తమ నాయకుడు రాహుల్ గాంధీ పట్ల దేశవ్యాప్తంగా అనుకూల పవనాలు వీస్తున్నాయని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఆయన ప్రధానమంత్రి కావడం ఖాయమన్నారు. పీలేరులో తనను ఆదరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బీఫాం అందజేసిన నల్లారి



పీలేరు, ఏప్రిల్ 22: పీలేరు అసెంబ్లీ నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సోమవారం తనకు తెలుగు దేశం పార్టీ అందించిన బీఫాంను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. విజయవాడలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి తన బీఫాం అందుకున్నారు. సోమవారం ఆయన పీలేరులోని రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకుని ఆర్వో ఫర్మాన్ అహ్మద్‌కు అందజేశారు.

టీడీపీలో చేరిన వైసీపీ మాజీ సర్పంచ్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 22:మండలం కోటవారుపల్లె పంచాయతీ మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు సొక్కం సత్యనారాయణ, వేణుగోపాల్ తమ అనుచరులతో టీడీపీలో చేరారు. సోమవారం ఉమ్మడి కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో వారు టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా షాజహాన్ బాషా మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన పథకాలు, పవన్‌కళ్యాణ్ పవర్ చూసి ఈ సారి ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోందన్నారు. మదనపల్లె అభివృద్ధి కావాలంటే చంద్రబాబును సీఎం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్నా నాయక్, కేశవ, సాగర్, మధుకర్‌రెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీలను మభ్యపెడుతున్న పెద్దిరెడ్డి

● పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్



విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 22: మదనపల్లె పర్యటనలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముస్లిం మైనారిటీలను మభ్యపెడుతున్నారని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ ఆరోపించారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గతంలో పార్లమెంట్‌లో ఎంపీ మిధున్‌రెడ్డి, రాజ్యసభలో ఎంపీ విజయసాయిరెడ్డి ఎన్‌ఆర్‌సీ, సీఏఏ బిల్లులకు మద్దతు ఇచ్చిన విషయం మరచిపోయారా? అని ప్రశ్నించారు. ఇప్పుడు ఎన్నికల్లో ముస్లీంలను ఏమార్చేందుకు పెద్దిరెడ్డి, మిధున్ ఇలా నాటకాలు ఆడుతున్నారన్నారు. చంద్రబాబు పాలనలో ముస్లీంల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేశారని, వాటిని వైసీపీ ప్రభుత్వం కొనసాగించక రద్దు చేసిన విషయం అందరికి తెలుసన్నారు. రాజంపేట ఎంపీగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యేగా షాజహాన్‌బాషాను ప్రజలు గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నవీన్‌చౌదరి, మాజీ సర్పంచ్ బద్దెల రాజన్న, మునుప్ప గౌడ్, చలపతిరావు, రెడ్డెప్ప పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కురబలకోట, ఏప్రిల్ 22: రక్తదానం ప్రాణదానంతో సమానమని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మిట్స్ ఎన్‌ఎస్‌ఎస్, రోటరీ క్లబ్, కర్ణాటకకు చెందిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రమాద సమయాల్లో రక్తం అందక ఎంతో మంది మరణిస్తున్నారని, అలాంటి వారికి ఇలాంటి రక్తదాన శిబిరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం అలవర్చుకోవాలన్నారు. రక్తదానం చేయడం వలన అనారోగ్య సమస్యలు తలెత్తుతాయనే అపోహ ఉందని, దానిని తొలగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన 110 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పిఆర్‌వో సతీష్, ఆడిటర్ చైతన్య, డీన్‌లు తులసీరామ్‌నాయుడు, చెన్నయ్య, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చింతపర్తి పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

వాల్మీకిపురం, ఏప్రిల్ 22: వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీని సోమవారం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వేణుగోపాల్‌రావ్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆస్పత్రిలో ల్యాబ్ పరిశీలించి రికార్డులు చూస్తూ డెంగ్యూ పరీక్షలు మరింత పెంచాలని సూచించారు. అలాగే వేసవి కాలంలో వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను బాధ్యతగా తెలియజేయాలన్నారు. బీసీజీ వ్యాక్సిన్ ఎవరెవరికి ఇవ్వాలన్న అంశంపై ఏఎన్‌ఎంలకు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు సన, ఆయేషా, శ్రీవిద్య, నాగభూషణం, సబ్‌యూనిట్ ఆఫీసర్ ముజీబ్‌బాషా, హెల్త్ సూపర్‌వైజర్లు సుధాకర్, భాను, సీహెచ్‌వో ఇందిరారాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మహిళపై మూకుమ్మడి దాడి

రామసముద్రం, ఏప్రిల్ 22: మహిళపై మూకుమ్మడి దాడి జరిగిన సంఘటన రామసముద్రంలో సోమవారం వెలుగు చూసింది. మండలంలోని దిన్నెమీదహరిజనవాడకు చెందిన జి.కవిత(28) భర్త వేధింపులతో రెండు రోజుల క్రితం పీటీఎంలోని పుట్టింటికి వెళ్లింది. పిల్లల బట్టలు, ఆధార్ కార్డు తీసుకురావడానికి దిన్నెమీదహరిజనవాడకు ఆది వారం వచ్చింది. దీనిని జీర్ణించుకోలేని కుటుంబీకులు రెచ్చిపోయి కవితని ఇంట్లో బంధించి మూకుమ్మడిగా దాడి చేసి చిత్రహింసలకు గురి చేశారు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన బాధితురాలు నిద్ర మాత్రలు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. 108 సిబ్బంది ఆమెను అడ్డుకొని ఆసుపత్రికి తరలించారు. కాగా బాధితురాలు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్లాస్టిక్‌తో మానవాళి మనుగడకు దెబ్బ



ధరిత్రి దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 22: మానవాళి మనుగడను ప్లాస్టిక్ వినియోగం ఎక్కువగా దెబ్బతీస్తోందని పేస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల, పేస్ సంస్థ సంయుక్తంగా మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ సౌజన్యంతో ధరిత్రి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ వినియోగం తగ్గిద్దామని నినాదాలు చేశారు. కోమటివానిచెరువు కట్టపై మొలచిన పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పేస్ సంస్థ నిర్వాహకుడు ఉత్తమేశ్వరరావు, ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ . పదేళ్లతో పోలిస్తే వేసవిలో ఎండలతో భూతాపం పెరిగి 45 డిగ్రీల సెంటిగ్రేడ్ ఆరెంజ్ సిగ్నల్ ఇస్తున్నారన్నారు. ఇదే కొనసాగితే మనుషులు బయట కూడా తిరగలేరన్నారు. విద్యార్థులకు ప్లాస్టిక్ వ్యర్థాల ప్రభావం అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి రూ.10 వేలు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, డాక్టర్ రమ్య, అధ్యాపకులు రెడ్డెప్ప, మునీంద్రనాయక్, శరత్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ సమావేశానికి పంచాయతీ ట్యాంకర్



వైసీపీ సమావేశం ప్రాంగణం వద్ద ఉన్న పంచాయతీ ట్యాంకర్

వాల్మీకిపురం, ఏప్రిల్ 22: వాల్మీకిపురం పట్టణంలోని తిరుపతి రోడ్డులో సోమవారం నిర్వహించిన వైసీపీ కార్యకర్తల సమావేశానికి గ్రామ పంచాయతీ నీటి ట్యాంకర్‌ను వాడుకున్నారు. కార్యకర్తల సమావేశం ప్రాంగణం వద్ద గ్రామ పంచాయతీ నీటి ట్యాంకర్ కనిపించడంతో వ్యవహారం జిల్లా అధికారుల దాకా వెళ్లింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో స్థానిక అధికారులు సైతం జిల్లాఅధికారుల ఆదేశాలతో అప్రమత్తమయ్యారు. ఈ విషయమై స్థానిక ఎంపీడీవో సుధాకర్‌రెడ్డిని వివరణ కోరగా సమావేశం ప్రాంగణం వద్ద గ్రామ పంచాయతీ ట్యాంకర్‌ను గమనించి అప్పటికప్పుడే తొలగించడం జరిగిందన్నారు. ప్రైవేట్ ట్యాంకర్ పెట్టుకోవాలని చెప్పిన సందర్భంలో పంచాయతీ కార్మికులు పంచాయతీ ట్యాంకర్ పెట్టారని అయితే గమనించిన తక్షణం వెళ్లి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

నేడు తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సు సర్వీసు

పీలేరు, ఏప్రిల్ 22: పీలేరు నుంచి తిరువణ్ణామలైకు చైత్ర మాస పౌర్ణమి సందర్భంగా మంగళవారం ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్లు పీలేరు ఆర్టీసీ డీఎం బండ్ల కుమార్ తెలిపారు. ప్రత్యేక బస్సు మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు పీలేరు బస్టాండు నుంచి బయలుదేరుతుందని, రానుపోను ఛార్జీలు రూ.750లు అన్నారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు 9014700628, 7382878751 నెంబర్లలో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

కమనీయం.. పట్టాభిరాముడి కల్యాణం



పట్టాభిరాముడి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 22 : మండలంలోని కందుకూరు గ్రామంలో వెలసిన పట్టాభిరాముడి కల్యాణోత్సవం సోమవారం కమనీయంగా సాగింది. ఉదయం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు సింహవాహనంపై స్వామి వారు దర్శనం ఇచ్చారు. అనంతరం సాయంత్రం పట్టాభిరాముల కల్యాణోత్సవాన్ని రాములవారి తరుపున కందుకూరుకు చెందిన కరణం ప్రకాష్‌రావ్, కరణం అభిరాం, కరణం సాంబశివరావ్, సుధాకర్‌రావ్, కరణంరామచంద్రరావ్, తదితరులు పాల్గొనగా సీతమ్మవారి తరుపున నరకూరి అఖిల, క్రిష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ పట్టాభిరాముల కల్యాణం అత్యంత వైభవంగా కనుల పండువగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం స్వామి వారు చంద్రప్రభ గరుడ వాహనంపై పురవీధుల్లో ఊరేగారు.

నల్లారి కుటుంబాన్ని ఆదరించి.. గెలిపించండి



పీలేరులో ప్రచారం నిర్వహిస్తున్న నల్లారి తనూజా రెడ్డి



కలికిరి ఏఎస్‌ఆర్ కాలనీలో ప్రచారం చేస్తున్న ఎన్డీయే నాయకులు

పీలేరు, ఏప్రిల్ 22: త్వరలో జరగనున్న ఎన్నికల్లో అభివృద్ధికి కట్టుబడిన నల్లారి కుటుంబాన్ని ఆదరించి గెలిపించాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనూజా రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పీలేరు పట్టణం ఇందిరమ్మ కాలనీ, బండ్లవంక ప్రాంతాల్లో సోమవారం ఆమె తన కోడలు డాక్టర్ నల్లారి షమా రెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నల్లారి కుటుంబానికి రాజకీయాలంటే వ్యక్తిగత అజెండా కాదని, రాజకీయాలంటే ప్రజాసేవ, నియోజకవర్గ అభివృద్ధి అని తెలిపారు. గతంలో తమకు దక్కిన అవకాశాలను కేవలం నియోజకవర్గ అభివృద్ధికే వినియోగించిన ఘనత నల్లారి కుటుంబానిదన్నారు. నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తన భర్త నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పీలేరు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలా నడిపారన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా నల్లారి కుటుంబం అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తోందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా నల్లారి కిశోర్ కుమార్ రెడ్డిని, ఎంపీగా నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపించి నిలిచిపోయిన అభి వృద్ధి కార్యక్రమాలను తిరిగి గాడిలో పెట్టే అవకాశం కల్పించాలన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం మళ్లీ సుభిక్షంగా ఉంటుందన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించి కూటమి ప్రభుత్వాన్ని తెచ్చుకోవాలన్నారు. అనంతరం సూపర్ సిక్స్ కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యల్లెల రెడ్డెప్ప రెడ్డి, యల్లెల మాంచాల, బుచ్చిరెడ్డి, చిన్న రెడ్డప్ప రెడ్డి, కంచి సూరి, పురం రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర, మల్లెల రెడ్డిబాషా, ఖాదర్, రెడ్డిముని, సురేశ్, శీన, బాబు, మహేశ్, హనీఫ్, కిరణ్, లక్ష్మీకర, పురం రెడ్డమ్మ, లక్ష్మీకాంతమ్మ, చందన, స్వర్ణ, రెడ్డిరాణి, ప్యారీ, షమ, రమాదేవి, రాధా, వీణ, సాధన, అమ్ము, ఖాదర్, ఆంజి, శేఖర, భాస్కర, రెడ్డిబాబు, హరి, మల్లిఖార్జున, బాబ్జీ, పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో పేదల సంక్షేమం

కలికిరి, ఏప్రిల్ 22: టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల పేదలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతాయని స్థానిక టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు అన్ని రకాల అభివృద్ధి కావాలంటే కూటమి అసెంబ్లీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డిని, కూటమి ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిని గెలిపించాలని ఎన్డీయే నాయకులు కోరారు. మైనారిటీల సంక్షేమం కోసం కిరణ్‌కుమార్ రెడ్డి, కిశోర్‌కుమార్ రెడ్డిని పెద్ద మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా టీడీపీ సూపర్ సిక్స్, మోదీ అభివృద్ధి పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికీ అందజేశారు. మాజీ ఎంపీపీ నల్లారి ఆనంద రెడ్డి, కలికిరి సర్పంచు ప్రతాప్‌కుమార్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, మాజీ సర్పంచులు నల్లారి లక్ష్మీకర్ రెడ్డి, అంజమ్మ, మాజీ జడ్పీటీసీలు నల్లారి చంద్రకుమార్ రెడ్డి, మాలతి, నల్లారి మారుతీ రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జీ బెజవాడ దినేష్, జబీర్, షావల్లి, అస్లామ్, నాగభూషణ రెడ్డి, జ్ఞానమూర్తి, రమేష్, వెంకటనారాయణ రెడ్డి, సహదేవ రెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, కేవీరెడ్డి, విజయకుమార్ రెడ్డి, ఏసురాజు, తిప్పారెడ్డి, వర్మ, అక్బర్, శీన, శేషాద్రి, రాజేష్, అబ్దుల్, అస్లాం, రాంబాబు పాల్గొన్నారు.